నా బాధ్యత పెరిగింది

- ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండా ...
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి

6

జంగారెడ్డిగూడెం నుంచి ఒక లారీ జీడిపిక్కల లోడ్‌తో బయలుదేరింది.. అప్పటి వరకూ కష్టపడిన కూలీలు లోడ్‌పైనే ఆదమరుపుగా నిద్రపోయారు..అర్ధరాత్రి.. చిమ్మచీకటి.. ఎదురుగా ఉన్న రోడ్డు కూడా సరిగా కనిపించదు.. అయినా లారీ వెళుతూ ఉంది.. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం వద్దకు వచ్చేసరికి లారీ ఒక చిన్న గోతిలో పడింది.. అంతే అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి జారిపోయింది.. లారీ బోల్తా పడిపోయింది. లోడు పైన ఉన్న ఏడుగురు కూలీలు బస్తాల కింద కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందారు. అదే పగలైతే ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఉండేది కాదు..ఏడు కుటుంబాల్లో ఆ రాత్రి మళ్లీ వెలుగురాని చీకటి నింపింది..

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన ముగ్గురు సోదరులు.. తల్లితో కలిసి జీవనోపాధి నిమిత్తం వైజాగ్‌లో ఉండేవారు.. అయితే ఇటీవల అక్కడి నుంచి పల్సర్ బైక్‌పై నలుగురు తమ స్వగ్రామం బయలుదేరారు.. తెల్లవారేసరికి ఇంటికి చేరుకోవాలనుకునే కంగారు.. బైక్‌పై వేగంగా వెళుతున్నారు.. మరో వైపు వర్షం పడుతూనే ఉంది.. నిద్రమత్తు కారణమో ఏమో తెలియదు కానీ కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి వద్దకు వెళ్లేసరికి బైక్ ఒక్కసారిగా జారిపోయింది.. అంతే నలుగురు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు.. తల్లి ఒక పక్కకు పడి పోగా ముగ్గురు కుమారుల పైనుంచి లారీ వెళ్లిపోయి మృతిచెందారు.ఆ కుటుంబంలో ఆ రాత్రి చీకటిని నింపింది.

ఎక్కడెక్కడో తిరిగొచ్చారు..ఆ ముచ్చట్లు కుటుంబీకులతో పంచుకోవాలనుకుంటూ ఆనందంగా వెళుతున్నారు.. రావులపాలెం మండలం ఈతకోట వచ్చేసరికి నిద్ర రావడంతో భర్త కారును పక్కగా నిలిపి పడుకుందామన్నాడు.. అయితే భార్య మాత్రం దగ్గరే కదా వెళ్లిపోదాం అంటూ స్టీరింగ్ తీసుకుంది.. అంతే కొద్ది దూరం వెళ్లేసరికి చీకటి కావడంతో రోడ్డును అంచనా వేయలేకపోవడంతో కారు కాలువలోకి దూసుకుపోయింది.. భర్త కళ్లెదుటే భార్య.. ఇద్దరు చిన్నారులు నీటిలో కొట్టుకుపోయారు.. తెల్లవారేసరికి చూస్తే విగతజీవులుగా మారారు.. అంతే ఆనందం ఒక్కసారిగా ఆవిరైపోయింది.. భర్తకు చీకటే మిగిలింది.

చీకట్లోకి.. జీవితాలు!



రాత్రి ప్రయాణం ప్రమాదకరం

చీకటి చాలా ప్రమాదకరమైనది.. ఎంతంటే ఎన్నో జీవితాలను తనలో కలిపేసుకుంటుంది.. బతికిఉన్నంత కాలం పలువురు జీవితాలను చీకట్లోకి నెట్టివేస్తుంది.. ఎవరికైనా తమ వారు తోడుంటేనే ఆనందం.. అందరూ ఉండి ఒక్కరూ లేకపోయినా ఏదో వెలితిగా ఉంటుంది.. పండగైనా.. ఫంక్షన్ అయినా వారులేని లోటు జీవితాంతం బంధువులను పీడిస్తూనే ఉంటుంది..అయినా రాత్రి వేళ ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేవారే కానరావడంలేదు. అసలు చీకట్లోనే ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి అని ఆరాతీస్తే.. అందులో ఒక వైపు అధికారులు.. మరో వైపు వాహనదారుల స్వయం తప్పిదమూ ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది. నిబంధనలపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక నిద్ర ముంచుకొస్తున్నా ఇంటికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

శంఖవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాత్రి ప్రయాణం చాలా ప్రమాదకరం.. ఎన్నో జీవితాలు చీకట్లో కలిసిపోయాయి. ప్రస్తుతం ఆయా కుటుంబాలు జీవచ్ఛవాలుగా మారాయి. అయినా నేటికీ మార్పురావడంలేదు. వాహనదారులు మేల్కోవడంలేదు. రాత్రి సమయంలో ప్రయాణించి జీవితాలను పణంగా పెడుతున్నారు.. అయిన వారిని కోల్పోతున్నారు. కోనసీమ జిల్లా గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతా వారిపేట వద్ద మంగళవారం తెల్లవారు జామున జరిగిన సంఘటన అటువంటిదే. ఎక్కడెక్కడో కుటుంబం అంతా ఆనందంగా గడిపారు.. మం గళవారం తెల్లవారేసరికి స్వగ్రామం చేరుకోవాలని సోమ వారం రాత్రికి బయలుదేరారు.. అంతా వార నుకున్నట్టు జరిగితే విహారయాత్ర ముచ్చట్లతో ఆ ఇల్లంతా సందడిగా ఉండేది. అయితే నిద్రమత్తు.. రోడ్డును అంచనావేయలేకపోవడం తదితర కారణాలతో ఆ కుటుంబం తీవ్ర విషాదంతో నిండింది.రాత్రి కావడంతోనే ఈ ప్రమాదం జరిగింది. అదే పగలు అయితే రోడ్డు కనిపించేది.ప్రమాదమూ జరిగి ఉండేది కాదు.రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరం సుమా.. ఇకనైనా మేల్కొండి.

రాత్రి ప్రమాదాలే ఎక్కువ..

ఉమ్మడి జిల్లాలో 100 కిలోమీటర్ల మేర 16వ నెంబరు జాతీయ రహదారి,60 కిలోమీటర్ల మేర 214 జాతీయ రహదారి ఉంది. కోనసీమ, ఏజెన్సీ ప్రాంతాల్లోను పలు రహదారులు ఉన్నాయి.



తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లవద్ద అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ(ఫైల్)

జాతీయ రహదారులపై నిత్యం వేలాది లారీలు దేశంలో పలు రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలను అరికట్టేందుకు.ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు రోడ్లను రెండులైన్లు, నాలుగు లైన్లుగా వెడల్పు చేసినా ఏటా ప్రమాదాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. వీటిలో రాత్రి సమయంలో జరిగిన ప్రమాదాలే ఎక్కువ. వీటిలో నిద్రమత్తు కారణంగా జరిగిన ప్రమాదాలే ఎక్కువ. రాత్రివేళలో రోడ్లు ఖాళీగా ఉండడం, వేగంగా నడిపితే త్వరగా ఇంటికి వెళ్లిపోవచ్చనే కారణంగా ఎక్కువ కిలోమీటర్లు వాహనాలు నడిపి ఉండడం నిద్రవచ్చినా బలవంతంగా నిద్రను ఆపుకుని వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.ఒక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే గత 10నెలల కాలంలో వెయ్యి ప్రమాదాలు జరగ్గా 500 మందిపైనే మృత్యువాత పడ్డారు. నిద్రమత్తులో ప్రమాదం జరిగితే కనీసం బ్రేక్ కూడా వేసే అవకాశం ఉండదు కాబట్టి ఎక్కువ శాతం వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. కొందరు క్షతగాత్రులుగా మారి అవయవాలు కోల్పోయి జీవచ్ఛవాలుగా మారి ఇంటికే పరిమితమవుతున్నారు.

నిబంధనలు గాలికి..

త్వరగా ఇళ్లు చేరుకోవాలనే కారణంతో నిద్ర ముంచుకొస్తున్నా చాలా మంది వాహనాలు నడుపుతారు. కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా లారీలను నిలుపుదల చేస్తారు. మరికొంత మంది నిషేధిత ప్రాంతాల్లో లారీలు నిలుపుదల చేస్తారు.అయినా పోలీసులు, రవాణాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎవరిది తప్పయినా నిద్రమత్తులో వాహనం నడిపేవారే ప్రాణాలు కోల్పోతున్నారు. జాతీయ రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుదల చేయకూడదు.వాహనాల నిలుపుదలకు ప్రత్యేకంగా నేషనల్ హైవే అథారిటీ స్థలాలు కేటాయిస్తోంది. కానీ వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపివేస్తుంటారు. వీటిని నిద్రమత్తులో గమనించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రమాదాలకు ఎక్స్‌ప్రెస్ హై..వే

- అతివేగం.. నిద్రమత్తు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- జీవచ్ఛవాలుగా కుటుంబాలు
- పట్టని రాత్రి నిబంధనలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- వచ్చీరాని డ్రైవింగ్‌తో యాక్సిడెంట్లు
- 10 నెలల్లో వెయ్యి ప్రమాదాలు
- 500 మందిపైనే మృత్యువాత

కొవ్వూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల నుంచి దివాన్‌చెరువు వరకు 55 కి.మీ ఉన్న ఎక్స్‌ప్రెస్ హైవేపై రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరంగా మారింది..అతివేగం కారణంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.చాలా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.గతేడాది హైదరాబాద్ నుంచి కుటుంబంతో కారులో బయలుదేరిన ఒక వ్యక్తి నల్లజర్ల వద్ద రోడ్డుపై ఆపిన లారీని గమనించకుండా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆత్రేయపురం మండలానికి చెందిన ఒక కుటుంబంలో నలుగురు మృత్యు వాతపడ్డారు. నవంబరు 3వ తేదీన కొవ్వూరు మండలం పంగిడి శివారు దేచర్ల వద్ద ఎక్స్‌ప్రెస్ హైవేపై కారు ఢీకొని వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఒక వ్యాన్ యజమాని దానిమ్మకాయల లోడ్ వేసుకుని వేగంగా వస్తున్నాడు. నల్లజర్ల మండలం దూబచర్ల వద్ద వ్యాన్ టైర్ ప్యాచ్చీపడడంతో డివైడర్ దాటుకుని వెళ్లిన వ్యాన్ మరో లారీ ఢీకొట్టింది.. దీంతో ఆ వ్యాన్ యజమానికి కం డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇటీవల కొవ్వూరు వద్ద ఒక లారీ మరొక లారీని ఢీకొన్న ఘటనలో డ్రైవర్ కేబిన్‌కు వేలాడుతూ కనిపించిన ఘటన హృదయ విదారకంగా మారింది.ఈ రహదారిపై ఇటువంటి ప్రమాదాలు సర్వ సాధారణంగా మారిపోయాయి.



పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారులో మంగళవారం తెల్లవారుజామున పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. ఈ ఘటనలో తల్లీకుమారుడు మృతిచెందగా, మరో కుమారుడు గల్లంతయ్యాడు



చీకట్లో ప్రయాణం.. చితికి తీసుకెళ్లింది!

7

10 కి.మీ రోడ్డు.. ప్రమాదకరం

పి.గన్నవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదం జీవితాలనే తారుమారు చేస్తుంది. అప్పటివరకు ఆనందంగా గడిపే కుటుంబాలు ఒక్క ఘోర ప్రమాదంతో విషాదంతో నిండిపోతాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజవరం-పొదలాడ రహదారిలో కొన్నేళ్లుగా జరు గుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.పి.గన్నవరం నుంచి గంటి వరకు 10 కిలో మీటర్లు మేర ఉన్న రహదారి చెంతనే ఉన్న ప్రధాన పంటకాల్వ ప్రమాదాలకు నిలయంగా మారింది.కొన్నేళ్లుగా ఇదే రహదారిలో జరుగుతున్న ప్రమాదాలు కొన్ని కుటుంబాలను చిన్నాభిన్నం చేశాయి.2017, నవంబరు 11న ఒక ఆటో కూలీలతో సహా పంట కాల్వలోకి దూసుకుపోతే పగటిపూట కావడంతో ఓ ప్రైవేటు ఉద్యోగితో పాటు స్థానికుల సాయంతో అందరూ బతికి బయట పడ్డారు.2022 డిసెంబరు 18న ద్విచక్ర వాహ నాన్ని భారీవాహనం ఢీకొట్టిన ఘటనలో ఒక రు మృతిచెందారు. 2024, ఫిబ్రవరి 18న ఒక కుటుంబం కారుతో సహా పంటకాల్వలోకి దూసుకెళితే అటుగా వెళ్తున్న ఓ కానిస్టేబుల్ కాల్వలోకి దిగి ఆ కుటుంబాన్ని రక్షించాడు. 2024, మే 14న ధాన్యం లోడును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో నలుగురు అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు.

బోగస్ ఏరివే(ట)త!



6

- అర్హత లేని పింఛన్‌దారుల ఏరివేతకు రంగం సిద్ధం
- క్షేత్రస్థాయిలో ఈనెల 9, 10తేదీల్లో పూర్తయిన సర్వే
- పైలెట్ ప్రాజెక్ట్‌గా తుని మండలం రేఖవానిపాలెం ఎంపిక

ఏమేం చర్చిస్తారో?

- నేడు, రేపు అమరావతిలో జిల్లాల కలెక్టర్ల సదస్సు
- కాకినాడ నుంచి పయనమైన కలెక్టర్ షాన్‌మోహన్
- డీప్‌వాటర్ పోర్టులో వాటాల బదలాయింపు, రేషన్ మాఫియా అక్రమాలు సహా పలు అంశాలు చర్చకు వచ్చే అవకాశం
- జిల్లాలో ప్రగతిపై ప్రజంటేషన్ ఇవ్వనున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అమరావతిలో బుధ, గురువారాల్లో జరగనున్న కలెక్టర్ల సదస్సుకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పయనమై వెళ్లారు. అక్కడ సదస్సులో జిల్లాకు సంబంధించి పలు అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం తనిఖీలు చేపట్టడం.. తదనంతర పరిణామాలతో కాకినాడ పోర్టు, రేషన్ మాఫియాపై కొన్నాళ్లుగా పదేపదే చర్చ జరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో కాకినాడ యాంకరేజ్ పోర్టు ద్వారా రేషన్ మాఫియాను అరికట్టడానికి తీసుకునే చర్యలపై సీఎం పలు సూచ నలు చేయొచ్చని సమాచారం. డీప్‌వాటర్‌పోర్టులో వాటాల బద లాయింపుపై కూడా సీఎం చర్చించవచ్చని చెప్తున్నారు. ఈ పోర్టు వాటాల వివాదంపై ఇప్పటికే సీఐడీ దర్యాప్తు చేస్తోంది. రేషన్ మాఫియా నిగ్గు తేల్చాలని సిట్‌ను కూడా నియమించారు. దీంతో వీటిపై లోతుగా చర్చించే అవకాశం ఉంది. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ బియ్యం గోదాములపై దాడులు చేసి 26వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. 13మంది పై కేసులు నమోదు చేశారు. దీనిపై సిట్ దర్యాప్తు చేస్తోంది.

కాకినాడ జిల్లాపై ఫోకస్

కలెక్టర్ల సదస్సులో కాకినాడ జిల్లాలో ప్రగతికి చేరుకోవాల్సిన లక్ష్యాలపై సమీక్షించనున్నారు. ఏరులై పారుతున్న నాటుసారా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. జిల్లాలో మిస్సింగ్ కేసుల వ్యవహారం చర్చకు రావొచ్చని చెప్తున్నారు.జిల్లాలో 1,86,512 మంది మిస్సింగ్ కాగా కేవలం 9,985 మాత్రమే ట్రేస్ అయ్యాయి. మిగిలిన కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జిల్లాలో 2,41,589 బ్యాంకు ఖాతాలు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయాల్సి ఉండగా 2,24,073 మ్యాపింగ్ అయ్యాయి. ఇంకా 17,516 పెండింగ్‌లోఉన్నాయి. జిల్లాలో 54,270 బాలబాలికలు ఉండగా ఇప్పటివరకు 16,076 మంది మాత్రమే ఆధార్ ఎన్‌రోల్ అయ్యింది. ఇంకా 52,597మంది ఎన్‌రోల్‌పై సమీక్షిస్తారు. జిల్లాలో 72 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా 63 సంఘాల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ఇలా జిల్లాలో జరుగుతున్న ప్రగతిపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. రెండురోజులపాటు కాన్ఫరెన్స్‌లో పాల్గొని తిరిగి ఈనెల 13న ఆయన జిల్లాకు చేరుకుంటారు.

భూ సమస్యల పరిష్కారానికి.. రెవెన్యూ సదస్సులు దోహదం

- కలెక్టర్ షాన్‌మోహన్

పెద్దాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, భూసంబంధమైన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. పెద్దాపురం మండలంలోని గోరింటగ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూసదస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నూరు శాతం భూసంబంధమైన సమస్యలు ఈ సదస్సుల ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించే దిశగా కృషి చేస్తోందన్నారు. రెవెన్యూ రీసర్వే విషయాలకు సంబంధించిన సమస్యలు మాత్రమే చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆర్డీవో శ్రీరమణి, తహశీల్దార్ వెంకటక్ష్మి, సర్పంచ్ నేరీకుమారి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

రసాభాసగా వైసీపీ సమావేశం

మెయిన్‌లో..

- కాకినాడలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైసీపీ సమీక్షా సమావేశం
- సంక్షేమ పథకాల అమలులో జాప్యంపై మాజీ మంత్రి బొత్స విమర్శలు
- ఈ నెలాఖరు, వచ్చే నెలల్లో జగన్ ఆధ్వర్యంలో ఆందోళనలకు పిలుపు
- అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని బొత్సను నిలదీసిన కార్యకర్తలు

కాకినాడలో జరిగిన సభలో మాట్లాడుతున్న బొత్స



అనధికారిక పర్మిట్ రూములు!

- మద్యం దుకాణాల్లో నిర్వహిస్తున్న వైనం
- బార్లను తరలిస్తున్న పర్మిట్ రూములు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు



కాకినాడ రూరల్‌లోని వాకలపూడిలో ఓ మద్యం దుకాణానికి చేర్చి ఏర్పాటైన అనధికారిక పర్మిట్ రూమ్



సీసా మూత తీసి మద్యం రిటైల్‌గా విక్రయిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో అనధికారిక పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఓపెన్ బార్‌లను తలదన్నేలా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుపుతున్నా నియంత్రించాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలో 18 మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం వేలంపాట నిర్వహించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయాలు నిర్వహించాలని, బెల్ట్‌షాపులు ఏర్పాటు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని వేలం ఖరారు సమయంలో నిర్వాహకులకు ప్రభుత్వం స్పష్టం చేసింది. మద్యం విక్రయాల సమయంపై స్పష్టమైన ప్రభుత్వ ఆదేశాలున్నా, రాత్రి పగలు అనే తేడా లేకుండా మద్యం విక్రయాలు పెద్దఎత్తున సాగిస్తున్నారు. మద్యం దుకాణాలు రోడ్డు పక్కనే ఉండడం, అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలతో మందుబాబులతో పలువురు ఇబ్బందులకు ఎదుర్కొవాల్సి వస్తోంది.

ఓపెన్‌బార్‌లు తలదన్నేలా..

ఓపెన్ బార్లు తలదన్నేలా మద్యం వ్యాపారులు అనధికారిక పర్మిట్ రూమ్స్ ఏర్పాటు చేశారు. టెండర్లలో మద్యం దుకాణం దక్కించుకున్న వ్యాపారులు మద్యం దుకాణం ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు సాగించుకోవాలి. అనధికారిక పర్మిట్ రూమ్ ఏర్పాటు చే యడం, దుకాణం వద్ద, బయట మద్యం తాగేందుకు వీలులేదు. అయినా నిర్వాహకులు మద్యం దుకాణాలతో పాటు విద్యుత్తు లైట్ల ఏర్పాటుతో అన్నిహంగులతో కూడిన పర్మిట్ రూంలు ఏర్పాటు చేశారు. బార్‌ల్లో మాత్రమే మద్యం తాగేందుకు ప్రభుత్వ అనుమతి ఉంది. మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్స్‌కి అనుమతిఇవ్వలేదు. అయినా రోడ్డు పక్కనే పెద్దగా అనధికారికంగా నిబంధనలను బేఖాతర్ చేస్తూ పర్మిట్ రూమ్స్ ఏర్పాటు చేసినా ఎక్సైజ్‌శాఖ అధికారులకు కనిపించడం లేదంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. మద్యందుకాణాల్లో బాటిల్స్ విక్రయానికి అనుమతి ఉండగా, ఇందుకు విరుద్ధంగా చిల్లరగా విక్రయాలుచేస్తున్నారంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనధికారిక బెల్ట్ షాపులు ఏర్పాటు చేసినా, పర్మిట్ రూమ్స్ నిర్వహించినా నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎక్సైజ్ నార్త్ సీఐ రామ్మోహన్ స్పష్టం చేశారు.

లంచం సొమ్ము తిరిగి ఇవ్వండి

- డీఎంహెచ్‌వోలో ఎంపీహెచ్‌ఏ స్థానాల నుంచి తొలగింపునకు గురైనవారి డిమాండ్

కాకినాడ క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖకు సంబంధించి 2002లో 217 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (ఎంపీహెచ్‌ఏ) పోస్టుల నియామకాల భర్తీకి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీఅయ్యాయి. అప్పుడు 10వ తరగతి ఉత్తీర్ణతను ప్రామాణికతతో భర్తీ ప్రక్రియ కొనసాగింది. అప్పుడు స్క్రూటినీలు లేకపోవడంతో 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పాస్ అయినవారు దరఖాస్తు చేశారు. అందులో అర్హత కలిగి ఉద్యోగం రాని చాలామంది కోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలో గొడవలు జరిగినా ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామక భర్తీ జరిగిపోయింది. దీంతో 2013లో మరో 120మందికి అప్పటి ప్రభుత్వం ఉద్యోగ భర్తీ ప్రక్రియ కొనసాగించింది. ఆందోళన చేస్తే ఉద్యోగ భర్తీ జరుగుతుందని ఉద్దేశ్యంతో మరో 150మంది ఒక్కొక్కరిగా కోర్టును ఆశ్రయించి ఉద్యోగాలు పొందారు. ఆ ప్రక్రియ నచ్చని కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో వారికి కూడా ఉద్యోగాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మొదట 217మంది మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉండి పూర్తి అర్హత కలిగినవారు అడ్డదిడడంగా వచ్చిన మిగతా 270మందిపై కోర్టుకు వెళ్లారు. దీంతో మొదట 217మంది కాక మిగతా 270మందిని ఉద్యో గాలనుంచి తొలగించాలని కోర్టు ఆదేశించింది. దీంతో తొలగించిన వారంతా కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని ముట్టడించారు. కారణం అప్పటి ఇన్‌చార్జ్ ఏవో అభ్యర్థి ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షలనుంచి రూ.4లక్షలవరకు వసూలు చేశారని ఆరోపిస్తున్నారు. దీంతో తొలగించినవారంతా ప్రస్తుత డిప్యూటీ డెమో అప్పటి ఇన్‌చార్జ్ ఏవోను తాము లంచంగా ఇచ్చిన డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని డీఎంహెచ్‌వో కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.


తుని మండలం రేఖవానిపాలెంలో తనిఖీ చేపడుతున్న పెద్దాపురం డీఎల్‌డీవో

బోగస్ ఏరివే(ట)త

పెద్దాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):

- అర్హత లేని పింఛన్‌దారుల ఏరివేతకు రంగం సిద్ధం
- క్షేత్రస్థాయిలో ఈనెల 9, 10తేదీల్లో పూర్తయిన సర్వే
- ప్రతి జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో పైలెట్ ప్రాజెక్ట్

బోగస్ పింఛన్ల ఏరివేతకు రంగం సిద్ధమైంది. అనర్హులను గుర్తించే సర్వే మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకో సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈనెల 9,10 తేదీల్లో ఆయా సచివాలయాల పరిధిలో బృందాలుగా ఏకకాలంలో సర్వే నిర్వహించారు. త్వరలో కొత్త పింఛన్ల మంజూరు వైపు అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం, వైసీపీ ఏలుబడిలో అనర్హులకు ఇబ్బడిమబ్బడిగా మంజూరైన బోగస్ పింఛన్లు ఏరివేయనుంది. కాకినాడ జిల్లాలో తుని మండలం రేఖవానిపాలెంలో, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం గోడిలో, తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు మండలం తాడిమళ్లలోని సచివాలయాల్లో ఈ సర్వే నిర్వహించారు.

పింఛన్ల అనర్హులపై రెండు నెలల క్రితమే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాలనాపరమైన పనుల ఒత్తిడి నేపథ్యంలో ప్రక్రియ వాయిదా వేస్తూ వచ్చింది. తాజాగా సంక్రాంతి కానుకగా అర్హులకు కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న సర్కారు ముందుగా బోగస్ ఏరివేతపై దృష్టిపెట్టింది. ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా కాకుండా జిల్లాకొక సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని సర్వే చేయిస్తోంది. సర్వే నివేదికను పరిశీలించి గ్రామసభ నిర్వహించి సర్వేలో వెల్లడైన బోగస్ పింఛన్ల వివరాలను తెలియచేసి అందరి ఆమోదంతో వాటిని రద్దు చేయాలని భావిస్తోంది.

అర్హులకు దక్కనందుకే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి అధికార పార్టీ నేతలు అధికారులపై ఒత్తిడి చేసి అనర్హులకు పింఛన్లు మంజూరు చేయించారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారుల పేరుతో ఎక్కువగా అర్హత లేని పింఛన్‌దారులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అదే సమయంలో రాజకీయ కారణాలవల్ల పింఛన్లు పొందని అర్హులు కూడా భారీ సంఖ్యలో ఉన్నట్లు ప్రభుత్వ పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలో బోగస్‌పై పూర్తిస్థాయిలో దృష్టిసారించింది. తాజా సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. తొలుత పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలని సూచించింది.

బయట పడనున్న అక్రమాలు

ఆధార్‌కార్డులో వయసుపెంచి వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న వారు, వైద్యులను మేనేజ్ చేసి సదరం సర్టిఫికెట్లు పొందినవారు, భర్త ఉన్నా ఒంటరి మహిళ ధ్రువపత్రాలు పొందినవారు, కళల ముఖం చూడని డప్పు, వాయిద్య కళాకారులపై సర్వే అధికారులు దృష్టిసారించనున్నారు. సదరు సచివాలయ పరిధిలో వివిధ కేటగిరీలకు చెందిన అర్హుల వివరాలను కూడా పనిలో పనిగా సేకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తం సర్వే నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తారు. పైలట్ సర్వే ఫలితాన్ని బట్టి ప్రభుత్వం పింఛన్లపై ముందుకు వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. 50ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పింఛన్లు మంజూరు చేస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. దీన్ని కూడా అమలు చేయాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి.

మొత్తంమీద ప్రభుత్వ తాజా నిర్ణయం బోగస్ లబ్ధిదారుల్లో వణుకు పుట్టిస్తుండగా అర్హుల్లో మాత్రం ఆనందం వ్యక్తమవుతోంది.

పారదర్శకంగా సమగ్ర సర్వే

జిల్లాకు ఒక సచివాలయ పరిధిలో సర్వే నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కాకినాడ జిల్లాలో తుని మండలం రేఖవానిపాలెం గ్రామ సచివాలయాన్ని ఎంపిక చేశారు. రెండురోజులపాటు ఆయా సచివాలయ పరిధిలో సమగ్ర సర్వే నిర్వహించారు. పారదర్శకత కోసం పొరుగు మండలానికి చెందిన అధికారులు ఉద్యోగులతో సర్వే చేపడుతున్నారు.

కేవీఎస్ ప్రసాద్, డీఎల్‌డీవో

కొత్తగా.. రెక్కలొచ్చెనా..!



కొత్తగా రెక్కలొచ్చినట్టుగా.. కొంగలు పంట పొలాల్లో పురుగులకోసం వెతుకులాట చేస్తూ.. అలా ఒక్కసారిగా ఎగిరిపోసాగాయి. కాకినాడ జిల్లా అన్నవరం హైవే పక్కన పొలాల్లో కొంగలు కనువిందు చేసిన ఈ చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

ఫొటోలు: కాకినాడ ఫొటోగ్రాఫర్/ఆంధ్రజ్యోతి



ఇంటర్ విద్యార్థులకూ... ప్రోగ్రెస్ కార్డులు

- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చర్యలు
- తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు
- ఈ ఏడాది నుంచే అమలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ నూతన విధానంతో విద్యార్థులు పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, వారి ప్రగతి తల్లిదండ్రులకు తెలియజేయడం ద్వారా మంచి ఫలితాల సాధనకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



సామర్లకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యా విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు, అంతర్గత పరీక్షల్లో వారు సాధించిన మార్కుల వివరాలను సదరు కార్డుల్లో నమోదు చేయనున్నారు. తల్లి తండ్రులకు చూపించి వారితో సంతకాలు చేయించి కళాశాలకు తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఇంటర్‌లో నెలకు ఒకటి చొప్పున నాలుగు యూనిట్ పరీక్షలు, త్రైమాసికం, అర్ధసంవత్సరం, ప్రీఫైనల్ పరీక్షలు రెండుసార్లు నిర్వహిస్తారు. వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు తెలుపు, జనరల్ ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థులకు లేతపసుపు, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు లేతనీలం రంగుల్లో కార్డులు సిద్ధం చేస్తున్నారు. హాజరు వివరాలు నమోదు చేయనుండడంతో విద్యార్థులు సక్రమంగా కళాశాలలకు వెళుతున్నారా, లేదా అనే విషయాలు తల్లితండ్రులకు తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కార్డుల నమూనాలను అధికారులు జూనియర్ కళాశాలలకు పంపించారు. వీటిని అమలు చేయాల్సిన తీరుపై ప్రిన్సిపాళ్ళకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డుల గురించి తెలియజేస్తూ వీటిని తప్పక అనుసరించాలని సూచనలు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో145 కళాశాలల్లో 44,408 మంది విద్యార్థులు

తూర్పు గోదావరి జిల్లాలో ఆర్ఐవో పరిధిలో ప్రభుత్వం, ఎయిడెడ్, మోడల్, ఏపీఎస్‌డబ్ల్యుఆర్, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థలకు చెంది 145 కళాశాలలు ఉన్నాయి. వీటిలో సీనియర్ ఇంటర్‌కు చెంది 20,878 మంది విద్యార్థులు, జూనియర్ ఇంటర్‌కు చెంది 23,530 మంది విద్యార్థులు.. మొత్తం 44,408 మంది ఉన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకే..

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రోగ్రెస్ విధానం ఎంతో దోహదం చేస్తుంది. ఈ ఏడాది నిర్వహించే ప్రతి పరీక్షకూ సంబంధించిన వివరాలు, హాజరు శాతం, ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపిస్తారు. దీంతో విద్యార్థుల వివరాలు, వారి పరిస్థితి అధ్యాపకులకు ముందుగానే తెలుస్తాయి. దీని ఆధారంగా వారిని బాగా చదివించి ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు కృషి చేస్తాం.

- ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, ఆర్ఐవో (ఇంటర్ విద్య)

నా బాధ్యత పెరిగింది

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండా ...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి



సీపీఎస్ రద్దు కోసం సైకిల్ యాత్ర చేపట్టినా, శ్రీకాకుళం నుంచి అమరావతి వరకు బస్సుయాత్ర నిర్వహించినా ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగకుండా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు గోపిమూర్తి. ఈనెల 5వ తేదీన జరిగిన తూర్పు పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో యూటీఎఫ్ బలపరిచిన బొర్రా గోపిమూర్తి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చరిత్రలోనే అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిచాడు. సోమవారం నాడు కాకినాడలో నిర్వహించిన కౌంటింగ్‌లో ఆయన సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 5259 ఓట్లు రాగా, గోపిమూర్తికి 9165 మొదటి ప్రాధాన్యత ఓట్లుతో గెలుపొందారు. నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన బొర్రా గోపిమూర్తితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ...

- నిడమర్రు

ఇంటర్వ్యూ..

ప్రశ్న: మీ ఉపాధ్యాయ జీవితం ఎప్పుడు ప్రారంభమైంది ?

1998 ఆగస్టు 19న ఆచంట మండలం భోగలాపురంలో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభమైంది.

ప్ర: యూటీఎఫ్‌లో ఎలాంటి పాత్ర పోషించారు ?

నా ఉద్యోగ జీవితంతో పాటు ఉపాధ్యాయ ఉద్యమాల పట్ల ఎక్కువగా ఆకర్షితుడయ్యాను. యూటీఎఫ్ కార్యకర్తగా పనిచేయడం నాకు ఎనలేని గుర్తింపునిచ్చింది. ఉపాధ్యాయ సమస్యల కోసం సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నాశక్తి మేరకు పనిచేశాను. ముఖ్యంగా మా నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ దివంగత షేక్ సాబ్జీతో పని చేసిన పోరాటాలు, ఉద్యమాలు నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. ఉద్యోగం జీవితంలో నేను పాల్గొన్న అసెంబ్లీ ముట్టడి, సి.ఎం క్యాంపుఆఫీసు ముట్టడి, విజయవాడ ధర్నా వంటి ఉద్యమాలను, పోరాటాలను గుర్తుంచుకొని యూటీఎఫ్, మిత్ర సంఘాల నాయకులు, కార్యకర్తలు నా విజయం కోసం పగలు, రాత్రి ఎంతో కష్టపడ్డారు.

ప్ర: ఎమ్మెల్సీగా ఎన్నికైన మీ లక్ష్యం ఏమిటి?

ఉపాధ్యాయ సంఘ నేతగా కన్నా ఇప్పుడు ఎమ్మెల్సీగా నా బాధ్యత మరింత పెరిగింది. శాస నమండలి సమావేశాలలో, రాష్ట్ర సచివాలయ సమావేశాలలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమ స్యల కోసం నిరంతరం పనిచేస్తా. ఉపాధ్యా యులు, ఉద్యోగులు, అప్రంటీస్ ఉద్యోగులు, కాం ట్రాక్టు ఉద్యోగులు, సీఆర్‌పీల సమస్యల కోసం కృషి చేస్తాను.

ప్ర: ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం కోసం ఏం చేస్తారు. ?

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌ల భారం, ఎండీఎం నిర్వహణ భారం, నిత్యం ఆన్‌లైన్ వర్క్‌లతో బోధన సన్నగిల్లుతోంది. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలపడాలంటే అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలి. ఉపాధ్యాయులను బోధనకు ఉపయోగించి మిగిలిన పనుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతి పాఠశాలకు రికార్డు అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఆయా వంటి ఉద్యోగులను నియమించడం ద్వారా ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో బోధనపై దృష్టి పెట్టడం జరుగుతుంది. తద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయి.

ప్ర: ఉపాధ్యాయులకు మీరిచ్చే సందేశం ?

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం పనిచేయడమే లక్ష్యం. నాకు మద్దతునిచ్చిన ప్రతి ఒక్క సంఘానికి, నాయకులకు, కార్యకర్తలకు, నాకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు. మా యూటీఎఫ్ ఉద్యమ నేత షేక్ సాబ్జీ అడుగుజాడలలో నడుస్తూ అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.



చవకగా సెకండ్ హ్యాండ్

తక్కువ ధరకు బైక్‌లు లభించే గ్రామంగా పేరు

పాత బైక్‌ల అమ్మకాలకు కేరాఫ్ సుబ్బయ్యమ్మపేట

సెకండ్ హ్యాండ్ మోటారుసైకిల్ కొనాలనుకుంటున్నారా? ధర కూడా తక్కువగా ఉండాలనుకుంటున్నారా? అయితే ఆ గ్రామం వెళ్లాల్సిందే. ఈమధ్య కాలంలో సెకండ్ హ్యాండ్ మోటార్ సైకిళ్ల విక్రయాల పేరు చెప్తే ఉమ్మడి జిల్లాలోనే ఆగ్రామం పేరు వినిపిస్తోంది. ఊరికి పల్లెటూరు అయినా వందలాది బైక్‌లు అమ్మకానికి సిద్ధంగా ఉంటున్నాయి. ఇలా సెకండ్స్ అమ్మకాలకు చిరునామాగా నిలుస్తున్న గ్రామం పేరు సుబ్బయ్యమ్మపేట.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం ఉన్న ఈ గ్రామంలో బయటి రాష్ట్రాలనుంచి భారీస్థాయిలో వాహనాలను తీసుకొస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం సహా పలు పట్టణాలకు హోల్‌సేల్‌గా ఇక్కడినుంచి సరఫరా చేస్తున్నారు.

● గండేపల్లి

తక్కువ ధరలోనే లభ్యం

గండేపల్లి మండలంలోని హైవేకు రెండు కిలోమీటర్లన్నర లోపల ఉన్న చిన్న పల్లెటూరు ఈ సుబ్బయ్యమ్మపేట. గ్రామంలో సెకండ్ హాండ్ మోటార్‌సైకిళ్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. రూ.10వేల నుంచి మోటారు సైకిళ్లు దొరుకుతున్నాయి. మోటారుసైకిళ్లను పక్క రాష్ట్రాలనుంచి వేలంపాటలో దక్కించుకుని కంటెయినర్లలో ఇక్కడికి తీసుకువస్తున్నారు. ఇక్కడ వాటికి వాటర్ సర్వీసింగ్, డేమేజ్ పాలిష్ లాంటి అన్ని రకాల హంగులు దిద్ది వాటిని ముస్తాబు చేస్తారు. ఆ తర్వాత విక్రయాలు చేపడుతున్నారు. జగ్గంపేట, రాజమండ్రి, కాకినాడలో ఉండే సెకండ్ హాండ్ షోరూమ్ వాళ్లు కూడా ఇక్కడ నుంచే మోటారు సైకిళ్లు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. సుబ్బయ్యమ్మపేటలో తక్కువ ధరకు మోటారుసైకిళ్లు లభ్యమవుతుండడంతో ఇక్కడికే వచ్చి మోటారు సైకిళ్లు కొనుక్కుంటున్నారు. ఇలా ఈ గ్రామం పేరు ఇప్పుడు పాత బైక్‌ల కొనుగోళ్లకు మారు మోగుతోంది..సుదూర ప్రాంతాల నుంచి సైతం వస్తున్నారు.

ఏజెన్సీలో వెదురు ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు

రంపచోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో వెయ్యి ఎకరాల్లో వెదురు ప్లాంటేషన్ ఏర్పాటు చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ఐఎస్‌బీ కన్సల్టెంట్ సత్యప్రసన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయనతో పాటు సబ్ కలెక్టర్ కల్పశ్రీ హాజరయ్యారు. గిరిజన రైతులు అటవీ హక్కులు పొందిన భూముల్లో వెదురు ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సబ్ డీఎఫ్‌వోలు అనూష, శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్లు రామకృష్ణ, వేణుగోపాల్, బాలాజీ, ఎఫ్ఆర్‌వోలు షరీఫ్, ఏడుకొండలు, బి.ఏడుకొండలరావు, పి.శ్రీనివాసరావు, నానాజీ, ఐఎస్‌బీ జిల్లా కో-ఆర్డినేటర్ జె.నానిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన అంశం తేల్చండి

పార్లమెంట్‌లో చర్చకు నోటీసు ఇప్పించండి

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మాజీ ఎంపీ ఉండవల్లి లేఖ

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ ఉభయ సభల్లోనూ విభజన జరిగిన తీరు.. తద్వారా మనకు జరిగిన అన్యాయం గురించి మీరే శ్రద్ధ తీసుకుని పార్లమెంట్‌లో చర్చకు నోటీసు ఇప్పించాలని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ లేఖరాశారు.ఈ లేఖ ప్రతిని మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేశారు.ఆ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాన్ని త్వరగా ఒక కొలిక్కి తీసుకుని రావాలని కోరారు. నేను సుప్రీంకోర్టు దాఖలు చేసిన పిటిషన్ పదేళ్లుగా నడుస్తూనే ఉంది. కేంద్రం ఇప్పటిదాకా కనీసం కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. 2018 ఫిబ్రవరి 18న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రూ.74,542 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నాయని తేల్చిందన్నారు. అదే ఏడాది జూలై 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లోక్‌సభలో జరిగిన అఘాయిత్యం గురించి వివరించానని, తాను చూపిన రికార్డులను పరిశీలించి ఆయన తన వాదనతో ఏకీభవించి చర్చకు నోటీసు ఇవ్వాలని, సుప్రీంకోర్టులో రాష్ట్రం తరపున అఫిడవిట్ దాఖలు చేయాలని నిర్ణయించారని, కారణాలేమిటో కానీ అవి అమలు కాలేదన్నారు. 2019 జనవరి 29న తాను విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశానికి వైసీపీ తప్ప ముఖ్యపార్టీల నేతలంతా హాజరయ్యారని దానికి జనసేన పార్టీ అధ్యక్షుడిగా మీరు హాజరుకావడంతో సమావేశం ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. అప్పట్లో మనం 2019 ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా మనకు జరిగిన అన్యాయంపై పార్లమెంట్‌లో చర్చించాలని, సుప్రీంకోర్టులో ప్రస్తావించాలని తీర్మానం చేసినట్టు ఆయన పవన్‌కల్యాణ్‌కు గుర్తు చేశారు. కానీ ఎన్నికల్లో గెలిచి సీఎం అయిన జగన్‌కి చంద్రబాబుకు రాసినట్టే లేఖ రాశానని, కనీసం ఆయన కార్యాలయం నుంచి సమాధానం రాలేదన్నారు. కానీ 2022 నవంబరు 28న సుప్రీంకోర్టులో సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ ఇన్నేళ్ల తర్వాత ఈ కేసును విచారిస్తే తేనెతుట్టను కదిలించినట్టేనని.. అందువల్ల కేసు మూసివేయాలన్నారు. ఏపీ తరపున హాజరైన న్యాయవాది చేసిన ఈ వాదన తనతో పాటు, అక్కడ ఉన్న తెలుగు న్యాయవాదులందరికీ విస్మయం కలిగించిందని వాపోయారు. 2023 ఫిబ్రవరి 23న అప్పటి ఏపీ ప్రభుత్వం నా వాదనను బలపరుస్తూ కౌంటర్ దాఖలు చేసిందన్నారు. దేశప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా కూడా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిన తీరు గురించి పార్లమెంట్‌లో పలుసార్లు ప్రస్తావించారని, కానీ అప్పటి మన ఎంపీలు వాటిపై చర్చ కోరలేదన్నారు. ఇవాళ మీరిద్దరూ బీజేపీతో కలసి రాష్ట్రం, కేంద్రంలోనూ అధికారంలోకి రావడం, విభజన సమయంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణలో, సహకరించిన బీజేపీ కేంద్రంలోనూ అధికారంలో ఉండడం మన రాష్ట్రానికి రావాల్సినవి రాబట్టు కోవడానికి, జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ఇదే సరైన సమయమని ఆ లేఖలో స్పష్టం చేశారు.

'తూర్పు' నుంచి మరింత మంది న్యాయమూర్తులను అందించాలి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నుంచి భవిష్యత్తులో మరింత మంది న్యాయమూర్తులు రావాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆకాంక్షించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం అదనపు సెషన్స్ కోర్టును వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ఠాకూర్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా పంటలు, ధాన్యాలు అందించే ప్రాంతమే కాకుండా హైకోర్టులో ఐదుగురు న్యాయమూర్తుల భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటుతో 700 పైగా కేసులు రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం బదిలీ అయ్యాయన్నారు. రామచంద్రపురంలో 250 మంది న్యాయవాదులు పనిచేయడం సంతోషకరమన్నారు.

న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మాట్లాడుతూ జిల్లా కోర్టు ఏర్పాటు ద్వారా జూనియర్ న్యాయవాదులకు పునాది పడిందన్నారు. జిల్లా జడ్జి గంధం సునీత మాట్లాడుతూ దశాబ్దాలుగా జిల్లా కోర్టు ఏర్పాటుకు న్యాయవాదులు చేసిన కృషి నేటితో ఫలించిందన్నారు. న్యాయవాదులు ఐకమత్యంగా ఉండి న్యాయం అందించాలన్నారు. జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి హరినారాయణ ముగింపు సందేశం అందించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్‌కు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి కృతజ్ఞతలు తెలిపారు.

అలిసిన ప్రయాణం... ఆయువు తీసింది!

విహారయాత్ర విషాదాంతమైంది. చిమ్మ చీకటి ఆపై 'అలిసి'న ప్రయాణం శాపంగా మారి ఆయువు తీసింది.. చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగించే భార్యాభర్తలు, చక్కనైన ఇద్దరు కుమారులు..హాయిగా సాగిపోతున్న ఆ కుటుంబ ప్రయాణం మంగళవారం తెల్లవారుజామున కుదుపులకు గురైంది. భార్య, ఇద్దరు పిల్లలను పోగొట్టుకుని ఓ వ్యక్తి ఒంటరిగా మిగిలాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటలో మంగళవారం తెల్లవారుజామున ప్రధాన పంట కాల్వలోకి కారు దూసుకుపోయిన సంఘటన ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది.


సంఘటనా స్థలంలో భార్య, కుమారుడి మృతదేహాల వద్ద విలపిస్తున్న విజయ్‌కుమార్

- తెల్లవారేదాకా ఆగితే ప్రాణాలు మిగిలేవి
- పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు ప్రమాదంలో భార్య, కుమారుడిని పోగొట్టుకుని ఒంటరైన వ్యక్తి
- కుటుంబం కన్నీరుమున్నీరు
- పి.గన్నవరం మండలం పోతవరంలో విషాదఛాయలు

పి.గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయ్‌కుమార్ భార్య ఉమా (32), కుమారుడు రోహిత్(9) కారు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. మనోజ్ (5) అనే మరో కుమారుడు కాల్వలో గల్లంతయ్యాడు. కేవలం 5 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే వారు గమ్య స్థానానికి వెళ్లిపోయేవారు. ఇదంతా పదిహేను నిమిషాల ప్రయాణం అంతే..కానీ మృత్యువు వారిని క్షేమంగా ఇంటికి చేరనీయలేదు. చిమ్మ చీకటి, ఆపై మంచు ఈ సమయంలో రోడ్డు ప్రయాణం ఎంత ప్రమాదమో ఈ ఘటన చాటిచెప్పింది.

చక్కని కుటుంబం..హాయిగా సాగే జీవితం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయ్ కుమార్ బీఎస్సీ బీఈడీ చదివాడు. కొవిడ్ ముందు వరకు ఓ ప్రైవేటు పాఠశాలలో పాఠాలు చెప్పుకుని జీవనం సాగించేవాడు. లాక్‌డౌన్ ప్రభావంతో వచ్చిన ఇబ్బందులతో ఉద్యోగం మానేసి ఓ కారు కొనుగోలు చేసి స్థానికులకు డ్రైవింగ్ నేర్పుతూ, మధ్య మధ్యలో కిరాయిలకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. విజయ్‌కుమార్ భార్య ఉమాకు కూడా డ్రైవింగ్ రావడంతో ఆమె కూడా మహిళలకు డ్రైవింగ్ నేర్పుతూ భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. వారికి రోహిత్ (మూడో తరగతి), మనోజ్ (యూకేజీ) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవింగ్ నేర్పుతూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో ఈ కుటుంబం ఆనందంగా జీవిస్తోంది. కష్టపడి పనిచేసుకోవడం కొన్ని డబ్బులు దాచుకుని కుటుంబం అంతా కలిసి బయటకు వెళ్లడం ఇలా సాగుతోంది వారి జీవిత ప్రయాణం..కానీ ఒక్క ప్రమాదం ఆనందకరమైన కుటుంబంలో విషాదాన్ని నింపింది. తేరుకోలేనంతగా దెబ్బతీసింది. విజయ్‌కుమార్ వైజాగ్ నుంచి నిరంతరాయంగా కారు నడుపుతూ రావడం వల్ల అలసిపోయి ఈతకోట దగ్గర ఆగిపోయాడు. అలా వారు తెల్లవారే దాకా అక్కడే ఉండి కారులో విశ్రాంతి తీసుకున్నా, ఈతకోటలో ఉన్న తమ బంధువులు ఇంటికెళ్లినా ప్రాణాలు మిగిలేవని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొడుకు కుటుంబం చిన్నాభిన్నం కావడంతో విజయ్‌కుమార్ తల్లిదండ్రులు వీరవెంకట సత్యనారాయణ, లక్ష్మి దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


విహారయాత్రలో విజయ్‌కుమార్ కుటుంబం(ఫైల్)


పోతవరం విజయ్‌కుమార్ నివాసంలో కోడలు, మనవళ్ల కోసం రోదిస్తున్న వీరవెంకటసత్యనారాయణ, లక్ష్మి దంపతులు

బతికే అవకాశం వచ్చి..చేజారి..

కారు పంట కాల్వలోకి దూసుకెళ్లిన తర్వాత విజయ్‌కుమార్ వెంటనే తేరుకుని వెనుక డోర్‌ను ఓపెన్ చేసి బయటకు వచ్చాడు. ఆ సమయంలో భార్య ఉమా, ఓ కుమారుడిని అతికష్టం మీద ఒడ్డుకు చేర్చాడు. మరో కుమారుడు కోసం మళ్లీ నీటిలోకి వెళ్లాడు. అయితే ఇక్కడ కూడా అతడికి విధి సహకరించలేదు. ఒడ్డుకు చేరిన భార్య, కుమారుడు ఆ చిమ్మ చీకట్లో తెలియక కాలుజారి మళ్లీ అదే కాలువలో మునిగిపోవడం అత్యంత విషాదం. కుటుంబం మొత్తం నీటిలో మునిగిపోవడం, సాయం చేయడానికి ఒక్కరూ లేకపోవడం అయినా తానొక్కడే ఆ చీకట్లో నీటిలో రక్షించే ప్రయత్నం చేయడం.. కొన్ని నిమిషాల పాటు విజయ్‌కుమార్ భరించిన బాధ వర్ణనాతీతం.. ఈ ఘటనతో అతను షాక్‌కు గురయ్యాడు. ఒడ్డుకు చేర్చింది చిన్న కుమారుడో, పెద్ద కుమారుడో కూడా అతను చెప్పలేకపోయాడు. మరోవైపు భార్య, కుమారుడు మృతదేహాల వద్ద విజయ్‌కుమార్ రోదించిన తీరు కలచివేసింది.

చాలా బాధాకరం : ఎమ్మెల్యే గిడ్డి

చింతావారిపేట వద్ద జరిగిన ఘటన చాలా బాధాకరమైనదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రమాద ఘటన వివరాలను విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహాయక చర్యలను పర్యవేక్షించారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పూర్తిచేయండి

కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు రాష్ట్ర టీడీపీ ఎంపీల బృందం వినతి


ఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు బొకే అందజేస్తున్న ఎంపీల బృందం

అమలాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టుల్లో అత్యంత ప్రధానమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టాలని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్‌మాధుర్‌తో పాటు ఏపీకి చెందిన ఎంపీల బృందం మంగళవారం కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను అభ్యర్థించింది. ఎంపీ హరీష్‌తో పాటు టీడీపీ పార్లమెంటరీ పక్షనేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పార్లమెంటు సభ్యులు కలిశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందించారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేసేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టాలని కోరారు. భట్నవిల్లి వరకు ఫేజ్-1 భూసేకరణ పూర్తి అయిందని, రెండో దశలో భూగంగా వంతెనల నిర్మాణానికి అవసరమైన భూమిని కూడా సేకరించారని, ఈ పంట సాగు తరువాత ఆ భూమిని స్వాధీనం చేసుకుని రైల్వే శాఖకు అప్పగిస్తామని తెలిపారు. భట్నవిల్లి అమలాపురం పట్టణానికి సమీపంలో ఉన్న దృష్ట్యా ప్రయాణికులు, సరుకు రవాణాకు ఎంతో అనుకూలంగా ఉంటుందని, కోటిపల్లి నుంచి భట్నవిల్లి వరకు అనుసంధానంచేసి వీలైనంత వరకు ట్రాక్‌ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని కోరారు. దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి చిరకాల కోరిక అయిన ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభించేందుకు కృషి చేయాలని, అమలాపురంలో గతంలో ఏర్పాటుచేసి తొలగించిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని.. ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో ఉదయ్, కోణార్క్, జన్మభూమి రైళ్లకు హాల్ట్ సౌకర్యం పెంచాలని ఎంపీ హరీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రం ఎంపీలతో కలిసి వినతిపత్రాన్ని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు అందజేసినట్టు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన సానా సతీష్

కాకినాడ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం కూటమి రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ నుంచి మూడు రాజ్యసభ స్థానాలకుగాను టీడీపీ అధిష్ఠానం విడుదల చేసిన జాబితాలో తనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల సతీష్ ఆనందం వ్యక్తం చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం సీఎం చంద్రబాబును కలిశారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సానా సతీష్

విద్యార్థుల స్థాయి ఆధారంగా బోధించాలి

ఆర్‌జేడీ నాగమణి


శిక్షణ జరుగుతున్న తీరును తెలుసుకుంటున్న ఆర్‌జేడీ

దివాన్‌చెరువు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయి ఆధారంగా బోధించినప్పుడే విద్యార్థుల అభ్యాసనా స్థాయి పెరుగుతుందని ప్రాంతీయ విద్య సంచాలకులు(ఆర్‌జేడీ) జి.నాగమణి అన్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థి స్థాయికి అనుగుణంగా బోధించాలని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కొండగుంటూరులోని ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఒకటో తరగతి విద్య పునాదిగా ఉంటుందని చెప్పారు. విద్యార్థికి భాష, గణితంలో అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఓర్పు, సహనం ఆభరణాలుగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో నమ్మకం కలిగించేలా విద్యాబోధన చేయాలని, అప్పుడే ప్రాథమిక పాఠశాలలు పూర్వవైభవం పొందుతాయని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌రోల్‌మెంట్ ఆందోళనకరంగా ఉందని, ఈ విషయాన్ని ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని వచ్చే విద్యా సంవత్సరానికి ముందే ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. శిక్షణా కేంద్రం నిర్వహిస్తున్న తీరును కోఆర్డినేటర్ పి.రాంబాబు ఆర్‌జేడీకి వివరించారు. అకడమిక్ పరంగా ఉపాధ్యాయులుకు అందుతున్న కంటెంట్‌పై కేఆర్పీలు, డీఆర్పీలను ఆమె అడిగి తెలుసుకున్నారు.ఉపాధ్యాయులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో కలసి శిక్షణాకేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని ఆర్‌జేడీ రుచి చూశారు. సమావేశంలో డైట్ లెక్చరర్ సుజాతరత్నం, ఎంఈవో సీహెచ్‌వీ సోమిరెడ్డి, ప్రథమ్ రాష్ట్ర పరిశీలకురాలు ధనిమిరెడ్డి గీతారమ్య, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వంశీకృష్ణ, వి.నాగేశ్వరి, కీరిసోర్స్ పర్సన్స్ ఈశ్వర్, కొండలరావు, గౌతమ్ కృష్ణ, డీఆర్పీలు పాల్గొన్నారు. అలాగే శిక్షణా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు సందర్శించారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని, నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృత్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు.

ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారిని అంటూ ఫేక్ కాల్స్

గొల్లప్రోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మేము ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంటు నుంచి మాట్లాడుతున్నాం. మీ షాప్‌ను చెక్ చేయాలి, రాకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలంటూ కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని పలు షాపుల నిర్వాహకులకు మంగళవారం ఫోన్‌కాల్స్ వచ్చాయి. అవి ఫేక్ కాల్స్‌గా గుర్తించిన వారు తమ షాపుల వద్దకు రావాలని సూచించడంతో మా అధికారులు వచ్చి మీ సంగతి చూస్తారంటూ ఫోన్ కట్ చేశారు. పట్టణంలోని శ్రీనివాస ఏజెన్సీస్ అధినేత కేదారిశెట్టి నానాజీకి మంగళవారం 6301937852 నుంచి ఫోన్‌కాల్ వచ్చి ఇదే విధంగా ఫోన్‌కాల్ రాగా వచ్చింది. బెదిరింపు ధోరణిలో మాట్లాడి ఫోన్ పెట్టేశాడని నానాజీ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

మరో వ్యక్తికి తీవ్రగాయాలు


మరణించిన అత్తి సూరిబాబు

తుని రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 16వ నెంబరు జాతీయ రహదారిపై ట్రాక్టర్ ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు పాత ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో అత్తి సూరిబాబు అక్కడికక్కడే మరణించగా మోటార్ సైకిల్‌పై వెనుక కూర్చున్న సింధిరపు అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. తుని రూరల్ ఎస్‌ఐ బి.కృష్ణమాచారి తెలిపిన వివరాలు ప్రకారం.. సూరిబాబు ప్రత్తిపాడుకు చెందినవాడు. అనిల్‌తో కలిసి తునిలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ వారిని ఢీకొంది. అనిల్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

10 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు సమీపంలో ఒక ఆటోలో 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం కోలమూరు సమీపంలో ఓ ఆటోను తనిఖీ చేయగా 10 కిలోల గంజాయిని గుర్తించామని, గంజాయి తరలిస్తున్న కోనసీమ జిల్లా మండపేటకు చెందిన సింగిడి రామ్ మణికంఠవంశీ, ఏలూరు జిల్లా రావికంపాడు గ్రామ సమీపంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన పెండెం వేణులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

కారు దగ్ధం

చింతూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం సరివెల సమీపంలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు కారును దగ్ధం చేశారు. విజయవాడ జగదల్‌పూర్ జాతీయ రహదారి మీదుగా జైలో కారు భద్రాచలం వైపు వెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. కాగా కారుకు చెందిన వ్యక్తులు ఎవ్వరూ కూడా పోలీసులను సంప్రదించలేదు. దీంతో కారు దగ్ధంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈనెల 8తో మావోయిస్టుల వారోత్సవాలు ముగిశాయి. కాగా 9న తెలంగాణ బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. దీంతో రాత్రి సమయంలో చింతూరు మీదుగా రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ఇది మావోయిస్టుల పనా లేదా సాంకేతిక కారణమా అనే విషయం స్పష్టం కావాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


సరివెల సమీపంలో దగ్ధమైన కారు

ఫొటోలు తీస్తున్నాడన్న కోపంతో...

స్తంభానికి కట్టి కొట్టారు

నలుగురిపై కేసు నమోదు


యువకుడిని స్తంభానికి కట్టేసిన దృశ్యం

ఉప్పలగుప్తం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆక్వా చెరువుల వద్ద ఫొటోలు తీస్తున్నాడన్న కోపంతో కొందరు ఒక యువకుడిని స్తంభానికి కట్టి కొట్టారు. ప్రస్తుతం బాధితుడు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో కొంతకాలంగా ఆక్వా సాగుకు వ్యతిరేకంగా కొందరు యువకులు ఆందోళన చేస్తున్నారు. హైకోర్టును ఆశ్రయించి రొయ్యల చెరువులను మూసివేయించారు. తాజాగా సోమవారం సాయంత్రం రొయ్యల సాగు తిరిగి ప్రారంభిస్తున్నారని తెలుసుకున్న గ్రామానికి చెందిన చిక్కం వీరదుర్గాప్రసాద్ ఆ ప్రాంతానికి వెళ్లి ఫొటోలు తీసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహించిన రైతులు అతడిని స్తంభానికి కట్టి కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిక్కం గాంధి, గనిశెట్టి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, వెంకట్రాజుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చలమల రాజేష్ తెలిపారు.

పులి కోసం గాలింపు

ప్రత్తిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో పెద్ద పులి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరంగా జరుగుతుంది. మంగళవారం కూడా ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కిత్తమూరుపేట బీట్ సెక్షన్ సిబ్బంది అటవీప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. పులి జాడ మాత్రం మంగళవారం రాత్రికి కూడా అటవీ సిబ్బందికి లభించలేదు. 6 ట్రాప్ కెమెరాలు బురదకోట పరిసర అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసినప్పటికీ పెద్దపులి ఆచూకీలభించలేదు. దీంతో పులి జాడ తెలుసుకునేందుకు చేపట్టాల్సిన అంశాలపై రేంజర్ దుర్గాప్రసాద్ సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు.

మహాసంస్థానంలో...

వైభవంగా సహస్ర చామంతి అర్చన


ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులు

పిఠాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సహస్ర చామంతి అర్చన నిర్వహించారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు పుష్పాలతో విశేష అలంకారం చేశారు. ఉదయం మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, సాయంత్ర అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్రహోమం, వివిధ హారతులు, స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాదగయలో సహస్ర తామర పుష్పార్చన

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు సహస్ర తామర పుష్పార్చన నిర్వహించారు. అనంతరం పుష్పాలతో దత్తాత్రేయస్వామిని అలంకరించారు. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్‌వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్టానం, అగ్నిప్రతిష్టాపన, దత్తమూల మంత్రహోమాదులు, మంగళహారతి నిర్వహించారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ఆళ్వార్

ఆత్రేయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్న ఆళ్వార్ సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు రెండోరోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరుమంగయై ఆళ్వార్‌ను పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాలు మంగళవాయిద్యాలతో ప్రకారోత్సవం, ద్రవిడ వేద పారాయణం, నివేదన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేపట్టారు.

వెంకన్న ఆదాయం రూ.2.09లక్షలు

వాడపల్లిలో వేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.2,09,534 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో తెలిపారు.


పల్లకీ మహోత్సవ దృశ్యం

మధురానగర్‌లో చోరీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ 48వ డివిజన్ పరిధిలో గల గోకులం మధురానగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. నండూరి వెంకటరాఘవాచార్యులు, ఆండాళ్లమ్మలు భార్యాభర్తలు. ఈనెల 3న హైదరాబాద్‌లో జరిగే బంధువుల షష్టిపూర్తి మహోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లారు. మంగళవారం ఉదయం మధురానగర్‌లో ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటికి వేసిన తలుపు తీసుకుని ఉండడాన్ని గమనించారు. బీరువాలో ఉన్న సుమారు 2 కాసుల బంగారం, కిలో వెండి చోరీకి గురైనట్లు గుర్తించి తిమ్మాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశామని ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'వేతన బకాయిలను చెల్లించాలి'

తాళ్లరేవు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలు, జిల్లాప్రజాపరిషత్ హైస్కూల్స్‌లో పనిచేస్తున్న వాచ్‌మెన్‌లు, ఆయాలకు వేతన బకాయిలను ప్రభుత్వం తక్షణం చెల్లించాలని సీపీఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే ఆందోళన చేపడతామని తెలిపారు.

సేంద్రీయ ఆకుకూరలు, కూరగాయలతో మేలు

ఐసీడీఎస్ పీడీ ప్రవీణ



కాయగూరలను పంపిణీ చేస్తున్న పీడీ ప్రవీణ

కొత్తపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణీలు, బాలింతలు సేంద్రీయ ఎరువులతో పండించిన ఆకుకూరలు,కూరగాయలు తినడం ద్వారా ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఐసీడీఎస్ పీడీ ప్రవీణ తెలిపారు. మండలంలోని మూలపేట సెక్టార్ పరిధిలో కొల్లవారిపాలెంలో ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా పండించిన ఆకుకూరలు, కూరగాయల పోషణ వాటికను ఆమె మంగళవారం పరిశీలించారు. ప్రతీ కేంద్రంలో పోషణ వాటికను ఏర్పాటుచేసి తద్వారా గర్భిణిలు, బాలింతలకు రసాయన రహిత కూరగాయలను పంపిణీ చేయాలన్నదే లక్ష్యమన్నారు. అనంతరం సెక్టార్ పరిధిలో గర్భిణులకు, బాలింతలకు ఆకుకూరలను పీడీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో దుర్గాదేవి, సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, సునీత, రామలక్ష్మి తదితర అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పిఠాపురంలో జనసేన నాయకుల సంబరాలు



పిఠాపురంలో సంబరాల్లో పాల్గొన్న మర్రెడ్డి

పిఠాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలోకి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును తీసుకోనున్నట్టు అధికారికంగా ప్రకటించడంతో పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సంబరాలు నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. పిఠాపురం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన పార్టీ పటిష్టతే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెన్నంటే ఉండి కృషి చేశారన్నారు. కూటమి విజయానికి నాగబాబు చేసిన కృషికి మంత్రి రూపంలో తగిన గుర్తింపు లభించినట్టుయిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెల్లుబోయిన సతీష్, దానం లాజర్‌బాబు, బీఎస్‌రాజు, చల్లా లక్ష్మీ, జనపరెడ్డి రాంబాబు తదితరులు ఉన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

పిఠాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దాళ్వాసాగుకు అనుకూలమైన వరి విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తనశుద్ధి చేయడం ద్వారా తెగుళ్లు ఆశించకుండా కాపాడుకోవచ్చని వ్యవసాయ విస్తరణాధికారులు జి.రామకృష్ణ, ఆర్.రాజేష్ తెలిపారు. పట్టణ శివారు ఏడుకాలువల వద్ద మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నెలాఖరులోగా వరినాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

వరి సాగుచేసే రైతులు పంటల బీమా నిమిత్తం ఎకరానికి ప్రీమియంగా రూ.630లను నెలాఖరులోగా చెల్లించాలన్నారు. రైతులకు దాళ్వాసాగులో పాటించాల్సిన అంశాలను వారు వివరించారు.

'కస్టమ్‌మిల్లింగ్' కేంద్రం ప్రారంభం

గొల్లప్రోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉన్న వేర్ హౌసింగ్ గోడౌన్లల్లో కస్టమ్ మిల్లింగ్ బియ్యం సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతుల నుంచి సేకరించి ధాన్యాన్ని మిల్లింగ్ నిమిత్తం మిల్లర్లుకు ఇచ్చిన తర్వాత వారు తెచ్చే బియ్యాన్ని ఇక్కడ సేకరిస్తారు. దీనిని మంగళవారం నుంచి ప్రారంభించామని వేర్‌హౌసింగ్ మేనేజరు కొండలరావు తెలిపారు. తొలిదశలో 5,500 మెట్రిక్ టన్నుల బియ్యం, రెండవ దశలో 4,500 టన్నుల బియ్యాన్ని సేకరించడం జరుగుతుందన్నారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొగలి అప్పారావు(నాని), ఉపాధ్యక్షుడు పేకేటి నాగేశ్వరరావు, పిఠాపురం, తుని ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపల్లి తిరుపతిరావు (చినబాబీ) కొబ్బరికాయ కొట్టి సేకరణకు శ్రీకారం చుట్టారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలను నిరోధించకపోతే పెనుముప్పు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి



కరప సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

కరప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలల పట్ల వివక్ష పెరిగిపోయి తీవ్ర రూపం దాల్చిందని, దీన్ని సమూలంగా నిరోధించకపోతే భావితరాలకు పెనుముప్పు వాటిల్లుతుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి పేర్కొన్నారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన మండలస్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీ, బాలల హక్కుల సంరక్షణ కమిటీల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల లైంగిక దోపిడీ, దాడికి గురవుతున్నారన్నారు. చిన్నతనంలోనే గర్భం దాల్చడం వల్ల మాతశిశు మరణాలు సంభవిస్తున్నాయని, శిశువులు అంగవైకల్యంతో జన్మిస్తున్నారని, పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బాల్య వివాహాలను సమూలంగా రూపుమాపి మెరుగైన సమాజం కోసం కృషిచేద్దామని పిలుపునిచ్చారు. బాలల పరిరక్షణ జిల్లా అధికారి సీహెచ్.వెంకటరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నా, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్టు ఎవరి దృష్టికి వచ్చినా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరు 1098కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మండలస్థాయి అధికారులతో కూడిన బాల్య వివాహ నిరోధక కమిటీ, బాలల హక్కుల సంరక్షణ కమిటీలను ఏర్పాటుచేశారు. ఈ కమిటీల్లో తహశీల్దార్ చైర్మన్‌గా, ఎంపీడీవో వైస్‌చైర్మన్‌గా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మెడికల్ ఆఫీసర్లు కన్వీనర్లుగా, మిగిలిన శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఐసీడీ ఎస్ ప్రాజెక్టు, జిల్లా బాలల పరిరక్షణ విభాగాల ఆధ్వర్యంలో సీడీపీవో యాసరపు లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్లు కె.శ్రీనివాసరావు, జె.విజయ, జిల్లా చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.విజయలక్ష్మి, ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఐసీడీఎస్ విస్తరణాధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాల్యవివాహాలు నేరం

సామర్లకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నిరోధించేందుకు అందరు భాగస్వాములు కావాలని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో ఎంపీడీవో కె.హిమమహేశ్వరి అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ హాజరయ్యారు. ఐసీడీఎస్ సీడీపీవో జీ.ఉషా, ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఈవోపీఆర్డీ భైరవ మూర్తి, చైల్డ్ రైట్స్ ఆదివాసీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజరు నిర్మలా కుమారి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆదానీని వెంటనే అరెస్టు చేయాలి



కాకినాడలో నిరసన వ్యక్తం చేస్తున్న మధు

కాకినాడ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సహజ వనరులను దోచేస్తున్న ఆదానీ గ్రూపు కంపెనీల అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. మంగళవారం భానుగుడి సెంటర్ కూడలిలో నిరసన నిర్వహించారు. అంతకు ముందు మదర్ థెరిస్సా సెంటర్ నుంచి ర్యాలీ జరిపారు. మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆదాని గ్రూపు కంపనీలను ప్రోత్సహించడంపై దర్యాప్తు జరిపేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని వేయాలన్నారు. అమెరికాలోని న్యూయార్క్ ఈస్టన్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఆదానీపై అవినీతి కేసు నమోదైందన్నారు. విద్యుత్ ఒప్పందాల కోసం ఆదానీ 4 రాష్ట్రాల్లో దాదాపు రూ.2100 కోట్లు ముడుపులిచ్చినట్లు ఆరోపణున్నాయన్నారు. అత్యధికంగా ఆంధ్రలో రూ.1700 కోట్లు గత వైసీపీ ప్రభుత్వ హయంలో ముడుపులు ముట్టజెప్పినట్టు తెలుస్తోందన్నారు. ఈ అవినీతిపై భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేస్తామన్నారు. అదేవిధంగా మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించుకోవాలన్నారు. అధిక ధరలను అరికట్టాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్, పి సత్యనారాయణ, సూరిబాబు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు కిట్ల పంపిణీ

కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జర్నలిస్టులకు ఆటవిడుపుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు అవసరమైన కిట్లను సానా సతీష్‌బాబు ఫౌండేషన్ తరపున చైర్మన్ తలాటం హరీష్ అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఫౌండేషన్ కార్యాలయంలో జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసెసియేషన్ సభ్యులకు క్రికెట్ కిట్లు అందించారు. రాజ్యసభ అభ్యర్థిగా సానా సతీష్ నామినేషన్ దాఖలు చేయడం పట్ల హరీష్ ఆనందం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ సభ్యుడు మంగా శివరామకృష్ణ, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యుడు తోట సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పి.వెంకటాపురం పీఎం కేంద్రీయ విద్యాలయంలో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ని మంగళవారం కలెక్టర్ షాన్‌మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. జాతీయస్థాయిలో చెస్‌పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన పదో తరగతి విద్యార్థి సాయి గంగాధర్, షూటింగ్ పోటీలో నాలుగో స్థానం సాధించిన 9వ తరగతి విద్యార్థి అశ్రీత, హాకీలో రీజినల్ స్థాయిలో ప్రథమస్థానం సాధించిన క్రీడాకారులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు. గ్రామ ఉప సర్పంచ్ పెంకే సోమరాజు, ప్రిన్సిపాల్ బి.శేఖర్, గ్రామ కార్యదర్శి రామోహ్మాన్‌చౌదరి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం



గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం మల్లవరంలో స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు ప్రత్యేక పూజలు.. స్వామికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. నెమలివాహనంపై స్వామి గ్రామోత్సవం జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

11,12,13 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కోలో ప్రధానమైన 132కేవీ పెద్దాపురం-పాయకరావుపేట లైన్ మార్పు చేయడంలో భాగంగా ఈనెల 11,12,13వ తేదీల్లో పిఠాపురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఖాజా రహంతుల్లా, ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఎల్ఎన్‌పురం, విరవాడ, గోవిందరాజులపాలెం, జల్లూరు పరిసర గ్రామాల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకూ సరఫరాలో అంతరాయం వచ్చే అవకాశం ఉందని, వినియోగదారులు విషయాన్ని గమనించాలని కోరారు.

జాతీయస్థాయి సదస్సులో పేపర్ ప్రజంటేషన్

కాకినాడ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటూ నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో కాకినాడ ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ కె.సాయిబాబు పాల్గొన్నారు. ఆయన పబ్లిక్ లైబ్రరీల ద్వారా రివిటలైజేషన్, స్వదేశీ సంస్కృతి, జ్ఞానం అనే అంశంపై పేపర్ ప్రజంటేషన్ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. సాయిబాబును కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో వర్మ అధ్యాపకులు అభినందించారు.

దుర్గాడలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు పరిశీలన

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దుర్గాడలో చెత్త సంపద కేంద్రం పక్కనే విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు నిమిత్తం ఏపీఈపీడీసీఎల్ అధికారులు పరిశీలన జరిపారు. సర్వే నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్, ఏఈ రామచంద్రరావు, దుర్గాడ ఉపసర్పంచ్ పంపన రామచంద్రరావు, జనసేన నాయకులు, వార్డు సభ్యులు ఉన్నారు.

నాగబాబుకు మంత్రి పదవిపై సంబరాలు

కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును రాష్ట్ర మంత్రి వర్గంలోకి తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంపట్ల మంగళవారం నగరంలోని పలు డివి జన్లలో జనసైనికులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. జనసేన పార్టీ కాకినాడ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి మల్లాడి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జగన్నాథపురం రామాలయం వీధి వద్ద సంబరాదలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నాయకులను, కార్యకర్తలను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ జనసేన పార్టీని శక్తవంతంగా తీర్చిదిద్దడంలో నాగబాబు పాత్ర వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో జనసైనికులు దుర్గాప్రసాద్, వెంకట సూర్య, యశ్వంత్, సాగర్, బాలు, మణికంఠ పాల్గొన్నారు.

రాజ్యసభ అభ్యర్థిగా సతీష్ నామినేషన్ దాఖలుపై ...



భానుగుడి సెంటర్ వద్ద సంబరాలు చేస్తున్న కూటమి శ్రేణులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూటమి రాజ్యసభ అభ్యర్థిగా సానా సతీష్ నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా మంగళవారం స్థానిక భానుగుడి సెంటర్‌వద్ద రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి పెంకే రాజు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచారు. రాజు మాట్లాడుతూ కష్టానికి తగిన గుర్తింపు సతీష్‌ను రాజ్యసభ అభ్యర్థిగా ప్రటించడమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ యనమదల రవి మాట్లాడుతూ జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయానికి సతీష్ కృషి చేశారన్నారు. కాదా శివ రామకృష్ణ, పెంకే శివ, కుడుపూడి వీరభద్రరావు, సేలం కుమార్, పెంకే వెంకటలక్ష్మి, రాయుడు దుర్గ, ఇళ్ల భవాని, శాంతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కౌలు రైతులకు అన్యాయం

కరప, డిసెంబరు 10: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో కౌలురైతులకు అన్యాయం జరుగుతుందని ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు ఆరోపించారు. కరప, వలసపాకల, పెదకొత్తూరు, యండమూరు, పెనుగుదురు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ఎండబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి కౌలురైతులతో మాట్లాడారు. కౌలు కార్డులు లేక కౌలురైతులు ధాన్యం అమ్ముకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలో దళారులను ఆశ్రయించి బస్తా దగ్గర రూ.100ల వరకు నష్టపోతున్నారన్నారు. ధాన్యం తూకం ఖర్చులను పూర్తిగా ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. రైతులు పలివెల రాంబాబు, వల్లు లోవరాజు, సత్యనారాయణ, కొండ, వనం అప్పారావు, జిత్తుక వెంకట్రావులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలు

● ప్రత్యేకాధికారి సత్యనారాయణ

కొత్తపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల ద్వారా సమస్యల పరిష్కా రాన్ని పొందవచ్చునని పిఠాపురం నియోజకవర్గ రెవెన్యూగ్రామ సభల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. కొత్తపల్లి మండలం అమీనబాద్ గ్రామంలో మంగళ వారం ప్రారంభమైన రెవెన్యూ గ్రామసభలో ఆయన ప్రసంగించారు. భూముల రీసర్వే సంబంధమైన సమస్యలు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తుందన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ నక్కామణికంఠ మాట్లాడుతూ తమ గ్రామంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన ప్రత్యేకాధికారి సత్యనారాయణ స్థానికంగా ఖాళీగా ఉన్నస్థలాలను పరిశీలించాలని తహసీల్దార్ జి.చిన్నారావుకు సూచించారు. దీంతో అమీనబాద్ ఊరిచివర ఉన్న స్థలం శ్మశానానికి అనుకూలంగా ఉంటుందని తహసీల్దార్ చెప్పడంతో ఆ ప్రాంతాన్ని ప్రత్యేకాధికారి పరిశీలించారు. ఏఎస్‌వో బండి అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ డీవీ మురళీకృష్ణ, మత్స్యకార నాయకులు బాదిన నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ బాబూరావు పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్: రెవెన్యూ సమస్యలకు సదస్సుల ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని పిఠాపురం తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ, మంగితుర్తి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నికలు

సామర్లకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):డీఆర్‌డీఏ ఆధ్వ ర్యంలో ఉన్న జిల్లా సమాఖ్య వార్షిక సమావేశం మంగళవారం సామర్లకోట టీటీడీసీ ఆవరణలో నిర్వహించారు. ముందుగా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి హాజరై డీఆర్‌డీఏ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన జిల్లా సమాఖ్య ఎన్నికలలో జిల్లా ఓబీలుగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా బి.చంటమ్మ, కార్యదర్శిగా యు.నాంచారమ్మ, సంయుక్త కార్యదర్శిగా జీఎంఎస్, కోశాధికారిగా కె.రత్నంలను ఎన్నుకున్నారు.

పిఠాపురంలో భగవద్గీత పోటీలు

పిఠాపరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భగవద్గీత పోటీలు నిర్వహించారు. వీహెచ్‌పీ తుని, పిఠాపురం ప్రఖండల పరిధిలో జరిగిన ఈ పోటీలకు అధికంగా విద్యార్థిని, విద్యార్థులు తరలివచ్చారు. మూడు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో తుని ప్రఖండ నుంచి ఎమ్.పురోహిత, జి.హస్విత, పి.కార్తీక్, కె.మానస, రిషితాదేవి, కె.భవిష్య, పిఠాపురం ప్రఖండలో సీహెచ్.వైష్ణవి, కే.నీహారిక విజేతలుగా నిలిచారు. న్యాయనిర్ణేతలుగా ఆర్.రవిశంకర్ పట్నాయక్, బీవీడీ రవివర్మ, బి.మంగామణి, కామేశ్వరశర్మలు వ్యవహరించి విద్యార్థిని, విద్యార్థులకు అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సత్తిబాబు, రామచంద్ర, అర్చకులు పి.విజయజనార్థనాచార్యులు, జి.గోవిందు, ఎల్.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలంపాటపై వివాదం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ రూరల్ సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో మంగళవారం దేవదాయ,ధర్మాదాయశాఖ ప్రత్యేకాధికారి శ్రీను ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ లైటింగ్, డెకరేషన్, చేపల చెరువు, కొబ్బరిచెట్లకు వేలంపాట నిర్వహించారు. ఎలక్ట్రికల్ లైటింగ్, డెకరేషన్, టెంట్‌హౌస్ కోసం వేలం పాట జరగ్గా ఏడాదికి రూ.2.66 లక్షలకు స్థానికులు పాటపాడుకున్నారు. స్వామివారి పుష్కరిణి గట్టుపైఉన్న కొబ్బరి, మామిడిచెట్ల ఫలసాయంకోసం రూ.45వేలకు పాడుకున్నారు. గుత్తుర్తి రాజు రూ.2.50 ఎకరాల చేపల చెరువుకు నిర్వహించిన వేలంపాటపై వివాదం తలెత్తింది. గతంలో వేలంపాట పాడుకున్న వ్యక్తి మధ్యలో తప్పుకోవడంతో అధికారిక ఉత్తర్వులు లేకుండా అనధికారికంగా చేపలసాగుకి ఎలా అనుమతి ఇచ్చారని స్థానికులు దేవదాయ,ధర్మాదాయశాఖ అధికారులను ప్రశ్నించడంతో గందరగోళం తలెత్తింది. ఈవిషయం తనకు తెలియదని, గతంలో పనిచేసిన ఈవోతో మాట్లాడి, సమస్య పరిష్కారమైన తర్వాత చేపలచెరువు లీజుకి పాట నిర్వహిస్తామని, అప్పటివరకు వాయిదావేస్తున్నట్లు ఈవో లక్ష్మీనారాయణ చెప్పారు.

ఏటుగట్టుపై ఆక్రమణల తొలగింపు

తాళ్లరేవు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ సీతారామపురం ఏటుగట్టుపై ఉన్న ఆక్రమణలను స్థానికుల ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తన సిబ్బందితో మంగళవారం తొలగించారు. ఏటుగట్టుపై వేసిన పాంచాలు, రేకుల షెడ్డులు, పాకలు, దడులను పంచాయతీ సిబ్బంది తొలగించారు. కోరింగ పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ



సీఎం చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడిని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కలిశారు. రాష్ట్ర సచివాలయం లో చంద్రబాబును మంగళవారం కలిసిన ఆయన నియోజకవర్గంలో పరిస్థితులు, పార్టీ సభ్యత్వ నమోదు తదితర అంశాలు గురించి వివరించారు. కాకినాడ సెజ్‌పై వైసీపీ నేతలు చేసిన తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టడం తో పాటు సెజ్ వ్యవహారంలో వైసీపీ నేతలు పాల్పడిన అవినీతి అక్రమాలు, భూదోపిడీ గురించి బహిర్గతం చేసి న విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. సెజ్ ప్రాంతంలో వచ్చే కొన్ని పరిశ్రమలు నుంచి వచ్చే కాలుష్యం వలన పిఠాపురం, తుని నియోజకవర్గాల్లో మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందని చంద్రబాబుకు తెలిపారు. తీరప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి సీఎంకు వివరించామని వర్మ చెప్పారు.

మెడికవర్ ఫ్యామిలీ కార్డు ఆవిష్కరణ



ఫ్యామిలీ హెల్త్ కార్డు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

సామర్లకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం ప్రతీ ఒక్కరికీ ప్రాథమిక హక్కు అని ఈ ఫ్యామిలీ కార్డు వలన మెరుగైన వైద్య సేవలు సామాన్యులకు సైతం మరింత చేరువవుతాయని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. మంగళవారం సామర్లకోట ఏడీబీ రోడ్డులో పనసపాడు వద్ద గల మెడికవర్ ఆసుపత్రిలో మంగళవారం ఫ్యామిలీ హెల్త్ కార్డుల ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేదని చింతించకుండా కుటుంబ సంరక్షణకు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే దిశగా ఫ్యామి లీ కార్డు ఒక ముందడుగు అని తెలిపారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ ఎం.శుభాకరరావు మాట్లాడుతూ విశ్వసనీయత ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ ఇప్పుడు తాజాగా మెడికవర్ ఫ్యామిలీ కార్డుతో ప్రతీ పేదకుటుంబానికి అత్యాధునిక పరికరాలు, సదుపాయాలతో అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రజలకు అందుబాటు లోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ మా ర్కెటింగ్ హెడ్ ఎస్.నాగరాజు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

మునిసిపల్ వర్కర్ల ఆందోళన

పిఠాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంపుదల, ఇతర డిమాండ్ల సాదన కోసం మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకి చేరుకుంది. సమ్మెలో ఉన్న వర్కర్లు పిఠాపురం మునిసిపల్ కార్యాలయం వద్ద ఆందోళన శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించిన వీరి అందోళనకు సీపీఎం నేత కోనేటి రాజు ఇతర నేతలు సంఘీభావం తెలిపారు. ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పనిచేస్తున్న వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు.

గొల్లప్రోలు: డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్, నాన్‌టెక్నికల్ వర్కర్లు చేపట్టిన సమ్మె మంగళవారం రెండోరోజుకి చేరింది. సమ్మెలో ఉన్న కార్మికులు ధర్నా నిర్వహించారు. వీరి అందోళనకు అసోసియేషన్ పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం పురపాలకసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

రెండోరోజుకు మున్సిపల్ వర్కర్ల సమ్మె



దీక్షలలో కూర్చున్న మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు మంగళవారం సమ్మె కొనసాగించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా శిబిరంవద్ద విధులను బహిష్కరించి నిరసన దీక్షలలో పాల్గొన్నారు. రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు సామర్లకోట యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి వివి.రామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పులపకూర రామకృష్ణ, ఉపప్రధాన కార్యదర్శి కాటంరెడ్డి ఏసు, కోశాధికారి నక్కా రత్న రాజు ఆధ్వర్యంలో సుమారు 22మంది వర్కర్స్ ఈ సమ్మెలో పాల్గొన్నారు. యూనియన్ అధ్యక్షుడు రామరాజు విలేకరులతో మాట్లాడుతూ సమ్మె రెండోరోజుకు చేరుకున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా అభించలేదన్నారు. ఈ ధర్నాలో చుంద్రు వెంకటరాజేష్, కాకాడ నాగార్జున, లంక శ్రీహరి, గరగ స్వామి, మామిడాల కొండబాబు, భాగ్యలక్ష్మి, భూదేవి వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రహదారులపైకి వస్తే కఠిన చర్యలు: సీఐ శ్రీనివాస్

జగ్గంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో దమ్ము చక్రాల ట్రాక్టర్ల కారణంగా తారు రోడ్లు, సిమెంటు రోడ్లు, పొలాలకు వెళ్లే రోడ్లు పాడైపోతున్నాయని సీఐ వైఆర్కే శ్రీనివాస్ పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని, దమ్ము చక్రాల ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



ఎటపాక మండలం నెల్లిపాకలో రిలే దీక్ష ప్రారంభించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ఆదివాసీలకు ఉద్యోగ భద్రత చట్టం చేయాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నెల్లిపాక, చింతూరు, వీఆర్ పురంల్లో రిలే దీక్షలు

ఎటపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల ఉద్యోగ భద్రతకు అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నెల్లిపాకలో 48 గంటల రిలే నిరాహార దీక్షను మంగళవారం ప్రారంభించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని శాఖల్లో ఖాళీలను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని కోరారు. ఐటీడీఏలు ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆదివాసీ ఎమ్మెల్యేలు తమ పరిధిలోని యువతకు ఉద్యోగ భద్రతకు అసెంబ్లీలో చట్టం తెచ్చేలా కృషి చేయాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆదివాసీలకు భూమికి బదులు భూమి, మౌలిక సౌకర్యాలతో పునరావాస కాలనీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమ్మల దుర్గారెడ్డి, మీడియం సురేష్, సవలం వెంకటేష్, గుండి లక్ష్మయ్య, కుంజా వినోద్, కురసం రాజశేఖర్, తెల్లం నవీన్ పాల్గొన్నారు.

చింతూరు (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ యువతకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చిన్న వీరభద్రం డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆదివాసీ నాయకులు మంగళవారం చింతూరు ఐటీడీఏ ఎదుట 72 గంటలు రిలే దీక్ష ప్రారంభించారు. వీరభద్రం మాట్లాడుతూ మన్యంలో నూటికి నూరు శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే కేటాయించాలన్నారు. ఇందుకు గిరిజన ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు. సంఘ నాయకులు పులి వీరయ్య, పొడియం లక్ష్మణరావు, దూబి లక్ష్మయ్య, సవలం కోటి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురం (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఉద్యోగాలను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రేఖపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఆదివాసీ నాయకులు గొంది చంద్రయ్య, బురక కన్నారావు మాట్లాడుతూ రంపచోడవరాన్ని ఆదివాసీ జిల్లాగా ప్రకటించాలన్నారు. దీక్షకు ఏటీఏ ఆదివాసీ ఉపాధ్యాయులు మద్దతు పలికారు. శిబిరంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల శాఖ అధ్యక్షుడు పాయం లక్ష్మణరావు, వీర్ల శ్రీను, సోడి వెంకటరమణ, సుబ్బారావు, వేటగాని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




వీఆర్ పురం మండలం రేఖపల్లి, చింతూరు ఐటీడీఏ ఎదుట దీక్షా శిబిరంలో ఆదివాసీ నాయకులు

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలందించాలి

వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలి: డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

ఎటపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీ హెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని, వ్యాక్సిన్ నిల్వలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో సి.జమాల్‌బాషా సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని నెల్లిపాక, లక్ష్మీపురం పీహెచ్‌సీలను సందర్శించారు. గర్భిణులను పరీక్షించి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ల్యాబ్ టెస్టులు, రిపోర్టులను పరిశీలించారు. ఎమర్జెన్సీ, ఎపిడమిక్ మందుల నిల్వలను తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీల పరిధిలో చివరిగా మలేరియా కేసు ఎక్కడ నమోదైందో, మలేరియా నివారణకు తీసుకున్న చర్యలపై అధికారులు, సిబ్బందిని ఆరా తీశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

13 నుంచి రెవెన్యూ సదస్సులు

రంపచోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ఏడు మండలాల్లోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఏడు మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయనతో పాటు సబ్ కలెక్టర్ కల్పశ్రీ హాజరయ్యారు. పీవో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా నిబంధన ప్రకారం భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తెల్ల రేషన్ లబ్ధిదారులకు బియ్యం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. సదస్సులు జరిగే రెండు రోజులు ముందు ఆయా గ్రామాల్లో టాంటాం వేయించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు సంబంధించిన వివరాలను సదస్సుల్లో ప్రదర్శించాలన్నారు. తహసీల్దార్లు రామకృష్ణ, వేణుగోపాల్, సీహెచ్ శ్రీనివాసరావు, కరక సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, ఏఎస్‌వీ సత్యనారాయణ, బాలాజీ, డిప్యూటీ తహసీల్దార్లు, మండల, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు, ఆర్‌ఐలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పీవో సింహాచలం

'కాలం చెల్లిన ఆహార పదార్థాలపై దృష్టి సారించాలి'

వై.రామవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారపు సంత, రేషన్ డిపోల్లో విక్రయిస్తున్న కాలం చెల్లిన ఆహార పదార్థాలు, వాటి నాణ్యతపై దృష్టిసారించాలని తహసీల్దారు వేణుగోపాల్‌కు మండల ఫుడ్ విజిలెన్స్ కమిటీ (జిల్లా వినియోగదారుల సమాఖ్య) డివిజన్ సెక్రటరీ పల్లాల విజయభాస్కర్‌రెడ్డి, ప్రెసిడెంట్ కె.వీరారెడ్డి వినతిపత్రం అందజేశారు. తాము వారపు సంత, రేషన్ డిపోలను తనిఖీ చేశామన్నారు. ఎక్స్‌పైరీడేట్ అయిన నిత్యావసర సరుకులు చౌక దుకాణాల్లో లభ్యమయ్యే బియ్యం, పంచదార, కందిపప్పు, చోడిపిండి ధరలను, నాణ్యతను పరిశీలించామన్నారు. వాటిని తనిఖీ చేసి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు పి.నాగమణి, బి.ఉమాదేవి పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

'పోలవరం నిర్వాసితుల హక్కులు అమలు చేయాలి'

దేవీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ముంపు గ్రామాలన్నింటికీ నష్టపరిహారం చెల్లించేంత వరకు పోలవరం ప్రాజెక్టు ద్వారా నీటిని నిల్వ చేసి నిర్మాణాలు నిలుపుదల చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించకుండా కాఫర్ డ్యామ్ నిర్మాణం చేపట్టిందన్నారు. దీంతో నిర్వాసితుల జీవితాలు అస్తవ్యస్తమయ్యాయని ఆవేదన చెందారు. నిర్వాసితులు ఇప్పటికీ మైదాన ప్రాంతాల్లో అద్దె ఇళ్లల్లో బతుకుతున్నారన్నారు. పోలవరం నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ నాయకులు అయినారపు సూర్యనారాయణ, యలగాడ నాగేశ్వరరావు, అరగాటి వీరభద్రరెడ్డి, కారం రామన్నదొర, చిన్నారావు, మడకం వెంకన్నదొర, పాండవులు, మద్దేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కిర్లంపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని తామరాడ, గోనేడ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తామరాడలో మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సర్పంచ్ తోట అయ్యన్న అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు నవీన్, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు నవీన్ సూచించారు.
తామరాడలో పది, గోనేడలో మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దారు జె.చిరంజీవి తెలిపారు. ఎస్వీఎస్ అప్పలరాజు, పాటంశెట్టి మురళీకృష్ణ, కంచుమర్తి రాఘవ, ఎంపీటీసీ గోకేడ రాజా, ప్రసాద్, తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, గోకేడ సత్యనారాయణ, పంచాది నానాజీ, సర్వే డీటీ శ్రావణి, ఆర్‌ఐ సత్యదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

జగ్గంపేట రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాక, మర్రిపాకల్లో జరిగిన రెవెన్యూ సదస్సులకు ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. రైతులు పొలానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు చేసినా వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఇర్రిపాకలో 28, మర్రిపాకలో 15 అప్లికేషన్లు వచ్చాయని తహసీల్దారు రమేష్ తెలిపారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పైడిపారు సూరిబాబు, అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు మురార్జీ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అంతకు ముందు ఆయన గ్రామంలోని దళితవాడలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలకు సంబంధించి తొమ్మిది, ఆన్‌లైన్ సర్టిఫికెట్ల కోసం 15 దరఖాస్తులు అందాయి. సర్పంచ్ నాగదేవి, మాజీ సర్పంచ్ అప్పలరాజు, శ్రీధర్, వీఆర్వో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. బురదకోటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. బురదకోట గ్రామానికి రహదారులు సక్రమంగా లేవని, ఉత్తరకంచి నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న బురదకోట కొండపైకి ప్రభుత్వం పక్కా రహదారులు నిర్మించాలని, గిరిజనులు జేసీని కోరారు. రెవెన్యూకు సంబంధించి 8, ఇతర శాఖలకు చెందిన 6 దరఖాస్తులు అందినట్టు తహసీల్దారు ఎం.సూర్యప్రభ తెలిపారు. సదస్సులో ఆర్‌ఐ గోపాలకృష్ణ, ఇన్‌చార్జ్ సర్వేయర్ బషీర్, మాజీ సర్పంచ్ నిమ్మల అప్పారావు, వీఆర్వోలు, వీఎస్‌ఐలు, వీపీవోలు పాల్గొన్నారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు పోతురాజు ఆధ్వర్యంలో కొత్తపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఫిర్యాదులను త్వరగతిన పరిష్కరించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు



కిర్లంపూడి మండలం తామరాడ రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న నవీన్



డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

జగ్గంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహించారు. సుమారు 400 మంది హాజరు కాగా వారికి రమేష్ భోజనాలు వడ్డించారు. రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, గంధం శ్రీనివాస్, దొడ్డా శ్రీను, గోకేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

జగ్గంపేట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రావులపల్లి పీహెచ్‌సీ వద్ద నెక్కంటి సీ ఫుడ్స్ కంపెనీ ఆర్థిక సహాయంతో శంకర్ ఫౌండేషన్ (విశాఖపట్నం) వారిచే మంగళవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నెక్కంటి సీ ఫుడ్స్ తిమ్మాపురం జనరల్ మేనేజరు గోపీచంద్ శిబిరాన్ని ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ డీజీఎం రమేష్ మాట్లాడుతూ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి.మనాలి, డాక్టర్ నికిత పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్టా సుగుణరావు, మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య, ముసిరెడ్డి నాగేశ్వరరావు, కంటే రామారావు, వెన్న వీరబాబు, బిక్కిన బాబి, దమరసింగు మధు, పప్పు గణేష్, నెక్కంటి రమేష్, డాక్టర్ చంద్రమౌళి పాపయ్యశాస్త్రి, రాయుడు శ్రీనివాస్, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

'బిగ్‌షాట్స్‌ని వెనకేసుకురావడంలో ఆంతర్యమేమిటో'

తుని రూరల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాలకు చెందిన వ్యాపార, పారిశ్రామికవేత్తలను వెనకేసుకుని రావడంలో ఆంతర్యం ఏమిటని భూములు ఇచ్చిన ఎస్ఈజెడ్ బాధిత రైతులు మీడియా సమావేశంలో ప్రశ్నించారు. యనమల తమపక్షాన లేఖ రూపాన గోడు వినిపిస్తే ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఎకరానికి రూ.3లక్షలు ఇచ్చి కారు చవకగా తమ వద్ద కొట్టేసిన భూములను కోట్లాది రూపాయలకు అమ్ముకున్నారని వాపోయారు. తప్పుడు రాతలు రాసే మీడియాకు తమ బాధలు పట్టవా అన్నారు. తాము సమస్యలపై 19 ఏళ్ళుగా పోరాడుతున్నామని, తమ నేత యనమల రామకృష్ణుడు దృష్టికి తీసుకెళ్తే ఆయనపై మూకుమ్మడి దాడి ఎందుకన్నారు. సమావేశంలో సెజ్ పోరాట సమితి నాయకులు పేకేటి యజమాని, కాలిబోయిన చంద్రరావు, ఆరిగెల నరసింహమూర్తి, అంగుళూరి సుధాకర్, దోమాల ప్రసాద్, బూర్తి కృష్ణ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సెజ్ పోరాట సమితి సభ్యుడు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జగ్గంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్యంవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్ఐ టి.రఘునాథరావు ఆధ్వర్యంలో మహిళా రక్షక్ కార్యక్రమం ద్వారా బాలికల రక్షణ, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్ పోత్రు వీర్రాజు, టీడీపీ శాఖ అధ్యక్షుడు పోత్రు రాము, నాయకులు పాల్గొన్నారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి) సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు కోరారు. మంగళవారం కత్తిపూడిలోని వర్తక సంఘం కమ్యూనిటీ హాలులో వర్తకులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాపారం చేసే సమయంలో మాయమాటలు చెప్పి మోసగిస్తారని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పొద్దన్నారు. ఆన్‌లైన్‌లో సైబర్ అరెస్టు అంటూ పోలీసు దుస్తుల్లో భయపెట్టేందుకు ప్రయత్నిస్తారని మోసపోవద్దని తెలిపారు. ఇలాంటి వాటిపై పోలీసులకు వెంటనే ఫిర్యాదు చెయ్యాలని కోరారు.

మానవ హక్కులపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత స్కూల్లో వందన యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్ అధ్యక్షతన మానవ హక్కుల దినోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌హెచ్‌ఆర్‌పీసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పల్ల శ్రీరామ్‌యాదవ్ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవడానికి కోర్టులతో పాటు మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. భవిత స్కూల్ ఉపాధ్యాయుడు అప్పాన పెదకాపు, హెచ్‌ఆర్‌పీసీ జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి అడబాల రాజా, మండల ప్రధాన కార్యదర్శి జి.సతీష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరంలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. విజ్ఞానజ్యోతి జూనియర్ కళాశాల, స్పార్క్ ఫౌండేషన్ సంస్థ నేతృత్వంలో విద్యార్థులు మానవహారం నిర్మించి అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సాయి సందీప్, వెంకటరమణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగలలో మానవహక్కుల దినోత్సవం

అడ్డతీగల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఆర్ స్వామి విద్యార్థులకు సూచించారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా తరగతుల అనంతరం విద్యార్థులకు ఆయన మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు బుజ్జయ్య, పట్టాభి, పీడీఎస్‌యూ నాయకుడు ఐ.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలతో ప్రాణాలకు ముప్పు'

అడ్డతీగల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలను తీసుకోవడం తమ ప్రాణాలకు ముప్పు అని వాటికి బానిసలైన వారిలో చైతన్యం రావాలని అడ్డతీగల సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్ పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారిణి శశికళ పలు అంశాలను వివరించారు. కౌన్సిలర్ నారే వాసు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారిణి ప్రసన్నదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రంప-రంపచోడవరం

రోడ్డు పనులు ప్రారంభించాలి

మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు

రంపచోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం-రంప రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు కోరారు. గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టి నెల రోజులైనా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని, మిషన్‌తో తవ్వడం వల్ల రోడ్డు అధ్వానంగా తయారై దుమ్ము, ధూళితో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణం రోడ్డు పనిని ప్రారంభించి విమర్శలకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత

తుని రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. భగవద్గీత 100 అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని మంగళవారం తునిలో నిర్వహించారు. కమిటీ ఉపాధ్యక్షుడు వి.శాంతరాజు, సభ్యులు జగన్, సత్యవతి, స్వాతి, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.




సానా సతీష్‌కు ఎమ్మెల్యేల అభినందన

జగ్గంపేట/ప్రత్తిపాడు/రౌతులపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన సానా సతీష్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అభినందించారు. ఆమె వెంట టీడీపీ నియోజకవర్గ నాయకులు పర్వత సురేష్, ఇటంశెట్టి భాస్కరరావు, వెన్నా శివ, బదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, ఆనంద్ న్యూటన్, బసవా ప్రసాద్ ఉన్నారు.



ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

విద్యార్థులకు స్వల్ప గాయాలు

రౌతులపూడి, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి) ఎన్ఎన్ పట్నం-తుని స్టూడెంట్ స్పెషల్ ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. తునిలో విద్యార్థులను ఎక్కించుకుని తిరిగి వెళ్తుండగా ఎస్.అగ్రహారం సమీపంలో ట్రాక్టర్‌ని ఢీకొంది. స్వల్ప గాయాలైన విద్యార్థులను స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటనాస్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరిపారు.

అడవి పందులు వేటాడుతున్న ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కంచెలతో అడవి పందులను వేటాడే పోతులూరుకు చెందిన మడికి సూరిబాబు, లంపకలోవకు చెందిన చిన్నిం జయబాబులను అరెస్టు చేసి మంగళవారం తహసీల్దారు వద్ద హాజరుపరిచారు. రెండు లక్షలకు బైండోవర్ చేసినట్టు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం తెలిపారు.

'రెడ్డి సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు తగవు'

తుని రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో ఎన్నో సంక్షోభాలను ఎదురొడ్డిన మేధావి యనమల రామకృష్ణుడిపై రెడ్డి సుబ్రహ్మణ్యం స్థాయికి మించి మాట్లాడటం తగదని బీసీ సంఘ నేతలు మీడియా సమావేశంలో పేర్కొన్నారు. బీసీ నేతలు కరెళ్ళ గణపతిరావు, పాలిక శ్రీను, పుట్టా నాగు, మేడిశెట్టి తాతాజీ, తోలెం ప్రసాద్, పూడి అప్పారావు, ధారా వీరబాబు, రంగాల శ్రీనివాసరావు, గెడ్డాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘ నేతలు

'హైందవ శంఖారావానికి తరలిరండి'

శంఖవరం, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి) విజయవాడలో వచ్చే నెల 5న జరిగే హైందవ శంఖారావానికి హిందువులు తరలిరావాలని సంఘ్ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం కత్తిపూడి దుర్గాదేవి గుడి వద్ద సమావేశం నిర్వహించారు. దేశంలో ఆలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ సభకు ప్రజలంతా తరలి రావాలన్నారు. 9240015333 నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా రిజిస్టరు చేసుకోవచ్చన్నారు.



సమావేశంలో పాల్గొన్న హైందవ సంఘ సభ్యులు

ఆక్రమణల గుర్తింపు

చింతూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చింతూరులో రహదారికి ఇరువైపులా ఆక్రమణలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు గుర్తించారు. ఆక్రమణలకు పాల్పడిన వారు దుకాణాలను నిర్దేశిత సమయంలో స్వచ్ఛందంగా తొలగించుకునే అవకాశం కల్పించారు. లేనిపక్షంలో కూల్చివేస్తామని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

దివ్యాంగుల దినోత్సవం

వై.రామవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత పాఠశాలలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిపారు. ఉపాధ్యాయుడు కె.రాజన్నదొర, సీఆర్పీలు, రాజ్‌కుమార్, ఆనంద్, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ

ప్రత్తిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి వద్ద మంగళవారం గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.మోహన్, సభ్యులు, ఆసుపత్రి వైద్యాధికారి సౌమ్య కిట్లు అందజేశారు.

40 లీటర్ల సారాతో ఇద్దరు మహిళల అరెస్టు

ప్రత్తిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగిలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. 40 లీటర్ల సారాతో ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్టు సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.